RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 305 పేజీలు - 08 మంగళవారం 29 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



## విద్యుత్ బిల్లుతో ట్రాఫిక్ చలాన్లు లింక్ చేయాలా?

**- పెండింగ్ చలాన్ల వసూలుపై సుప్రీంకోర్టు కీలక సూచన**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:** పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను వసూలు చేసేందుకు విద్యుత్ బిల్లులతో అనుసంధానం చేసే అంశాన్ని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. చలాన్లు చెల్లించకుండా ఉన్న వాహనదారుల నుంచి బకాయిలను వసూలు చేసేందుకు మిగతా2లో...

# అసెంబ్లీ కంటే.. జైలుకే ఎక్కువసార్లు వెళ్లా...

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ అనేకసార్లు జైలుకు పంపారు: సీఎం రేవంత్‌రెడ్డి**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:** తెలంగాణ అసెంబ్లీకి వెళ్లిన దానికంటే తాను ఎక్కువసార్లు జైలుకే వెళ్లానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అనేకసార్లు జైలుకు పంపారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'ది కాన్‌క్లేవ్ 2026' కార్యక్రమంలో 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయాలు, విద్య, కేంద్రరాష్ట్ర సంబంధాలు, నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికల ప్రక్రియతో పాటు తన రాజకీయ ప్రస్థానంపై పలు అంశాలను వెల్లడించారు. **విద్యకు అత్యంత ప్రాధాన్యం** దేశ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మిగతా2లో...



## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత

**- స్థానిక రిజర్వేషన్లకు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:** తెలంగాణలో స్థానికత, స్థానిక రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో స్థానిక రిజర్వేషన్ల ప్రయోజనం పొందాలంటే నిర్దేశిత మిగతా2లో...

## అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై చైనా సుంకాల తగ్గింపు

**- సోయాబీన్స్‌కు మాత్రం అదనంగా 10 శాతం సుంకం కొనసాగింపు**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:** అమెరికాచైనా వాణిజ్య చర్చల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పలు వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు చైనా అంగీకరించింది. అయితే మిగతా2లో...




## ఖైరతాబాద్ ఉపఎన్నిక..

**- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల బలపరీక్ష...ముమ్మరమైన రాజకీయ పోరు!**

## ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

**- రూ.50 లక్షల అటాచ్‌మెంట్ ధ్రువీకరణ ఉత్తర్వులు రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్**






## ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

**లారీ - ఆటో ఢీ.. మరో ఇద్దరి పరిస్థితి విషమం**

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 28:** మంచిర్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నస్పూర్ మండల కేంద్రంలో కూలీలతో వెళ్తున్న ఆటో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. మిగతా2లో...

# అభ్యర్థి ఎవరైనా.. గెలుపే ధ్యేయం

**ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించాలి: కేటీఆర్**

**ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉమ్మడి పాలమూరు బీఆర్ఎస్ నేతలతో సమావేశం**



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 28:** హైదరాబాద్ రంగారెడ్డిమహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరైనా ఆయన విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు సూచించారు. ఎన్నికల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో కేటీఆర్ సమావేశమయ్యారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. **ఓటర్ల నమోదుపై దృష్టి** ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించడం ముఖ్యమని కేటీఆర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, మిగతా2లో...



సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను

## తొలగించాలి

**- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ ఆందోళన.. ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద ధర్నా**

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 28:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించారు. **సీఈసీపై ఆరోపణలు** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, మిగతా2లో...

## తొలిసారి కక్ష్యలోకి స్టార్‌షిప్

**స్పేస్‌ఎక్స్‌కు కీలక మైలురాయి.. 26 స్టార్‌లింక్ ఉపగ్రహాల ప్రయోగం**



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 28:** స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన స్టార్‌షిప్ రాకెట్ తొలిసారిగా భూకక్ష్యలోకి విజయవంతంగా చేరింది. అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న స్టార్‌బేస్ నుంచి చేపట్టిన 14వ ప్రయోగంలో ఈ కీలక మిగతా2లో...

## నిరసనలకు అడ్డాగా సచివాలయం

**- కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు**



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 28:** పరిపాలనకు కేంద్రంగా ఉండాల్సిన రాష్ట్ర సచివాలయం కాంగ్రెస్ పాలనలో నిరసనలకు వేదికగా మారడం సిగ్గుచేటని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు తమ బకాయిల కోసం సచివాలయం వద్ద ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ.. చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ గతంలో చేసిన ఆరోపణలను ఆయన మరోసారి ప్రస్తావించారు. కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే బిల్లులు నిలిపివేస్తున్నారా మిగతా2లో...

# ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 28:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటుకు నోటు కేసులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. ఈ ఉత్తర్వులతో రేవంత్‌రెడ్డితో పాటు మరో ముగ్గురికి ఈ అంశంలో ఉపశమనం లభించింది.న్యూఢిల్లీలోని స్మగ్లర్స్ అండ్ ఫారెన్ ఎక్స్ఛేంజ్ మ్యానిప్యులేటర్స్ పరిధి లోని అప్పిలేట్ ట్రైబ్యునల్ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తి మునీశ్వర్‌నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం రేవంత్‌రెడ్డి, వేమ్ కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్ ఉదయ్‌సింహ, బిషప్ హ్యారీ సెబాస్టియన్ దాఖలు చేసిన అప్పీళ్లను విచారించింది. 2015 నాటి ఓటుకు నోటు వ్యవహారంలో రూ.50 లక్షల నగదును ఏసీబీ ఇప్పటికే స్వాధీనం చేసుకుని ట్రయల్ కోర్టులో భద్రపరిచిందని అప్పీలుదారుల తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో అదే మొత్తానికి సమానమైన మరో రూ.50 లక్షలను ఈడీ అటాచ్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.ఈ వాదనను పరిశీలించిన ట్రైబ్యునల్.. అసలు రూ.50 లక్షలు ఇప్పటికే కోర్టు ఆధీనంలో భద్రంగా ఉన్నందున వాటిని నిందితులు తరలించడం లేదా ఇతర విధంగా వినియోగించే అవకాశం లేదని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో సమాన విలువ కలిగిన మరో మొత్తాన్ని అటాచ్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో 2022లో అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది.అయితే ఈ తాజా ఉత్తర్వులు మొత్తం ఓటుకు నోటు క్రిమినల్ కేసును కొట్టివేసినట్లు కాదని సంబంధిత నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానంగా ఈడీ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌కు సంబంధించిన అంశంపైనే ట్రైబ్యునల్ నిర్ణయం వెలువరించింది.

# అసెంబ్లీ కంటే.. జైలుకే ఎక్కువసార్లు వెళ్లా...

(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకోవడం వల్లే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి ఎదిగారని, మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఎదిగారని పేర్కొన్నారు. తెలంగాణలో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని సీఎం తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు, ఆ తర్వాత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. **రాజకీయ ప్రస్థానంపై వ్యాఖ్యలు** తన రాజకీయ ప్రస్థానాన్ని కూడా రేవంత్‌రెడ్డి వివరించారు. 2006లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచానని, 2007లో స్వతంత్ర ఎమ్మెల్సీగా విజయం సాధించానని తెలిపారు. అనంతరం ప్రతిపక్షంలో ఉండాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీలో చేరానని, ఆ పార్టీ తరఫున 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి, 2019లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యం తగ్గిందని, ప్రజల సూచనతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాహుల్‌గాంధీని తొలిసారి కలిసిన సందర్భాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. **ఎక్కడ ఉన్నా ప్రజాసేవే లక్ష్యం**2014 తర్వాత తెలంగాణలో రాజకీయ పోటీ కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారిందని సీఎం పేర్కొన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏతో రాజకీయంగా పోరాడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తన రాజకీయ ప్రయాణంలో రాహుల్‌గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ తనకు శ్రేయోభిలాషులుగా ఉన్నారని చెప్పారు.తాను విద్యార్థి సంఘంలో ఉన్నా, తెలుగుదేశం పార్టీలో ఉన్నా, కాంగ్రెస్‌లో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం పనిచేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# అభ్యర్థి ఎవరైనా.. గెలుపే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

విద్యాసంస్థలు, ఉద్యోగ వర్గాల్లో అర్హత ఉన్న గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని నాయకులకు సూచించారు. పార్టీ ఖరారు చేసే అభ్యర్థి విజయానికి నాయకులు, కార్య కర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వంపై గ్రాడ్యుయేట్లు, విద్యావంతుల్లో వ్యతిరేకత ఉందని కేటీఆర్ సమావేశంలో పేర్కొన్నట్లు ఆంధ్రజ్యోతి తెలిపింది. అలాంటి ఓటర్లను పార్టీకి అనుకూలంగా మలచుకునేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.**పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరైనా ఆయన గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కేటీఆర్ కోరారు. ఎన్నికలకు ముందుగానే ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించి, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌కు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ మంత్రులు వి. శ్రీనివాస్‌గౌడ్, ఎస్. నిరంజన్‌రెడ్డి, సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్‌కు మార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, రావుల చంద్రశేఖ ర్‌రెడ్డి, మాజీ ఐపీఎస్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. మాజీ శాట్స్ చైర్మన్ ఆంజనే యులుగౌడ్, గద్వాల జిల్లా నాయకుడు హనుమంత్‌నాయుడు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి)

వివేక్ జోషి లేవనెత్తినట్లు వచ్చిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో ప్రత్యేక సవరణకు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఓటర్ల సమాచారంలో మార్పులు చేసే విధానం, క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్నికల నమోదు అధికారుల బాధ్యతలు, పర్యవేక్షణపై వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కూడా జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్షర దోషాలను సరిదిద్దకుండానే నోటీసులు జారీ చేయడంపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు.**ఓటు హక్కును కాపాడాలి** నిరసనలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని అన్నారు. ๑

ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేర్లు తొలగిస్తున్నారన్న ఆందోళనలకు ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై వచ్చిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని గతంలో కోరారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 28న తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లోనూ ఆందోళనలు నిర్వహించినట్లు పార్టీ నేతలు తెలిపారు.మరోవైపు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి తమ పార్టీ లేవనెత్తుతున్న అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని కోరారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ నేతలు లేవనెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఫారం-6లో మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు విధానం తదితర అంశాలపై ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన వివరణ రావాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై తమ ఆందోళనలను కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నిక..

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 28:** తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమవుతోంది. దానం నాగేందర్ అనర్హత ఉదంతంతో ఖాళీ అయిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి త్వరలో జరగనున్న ఉపఎన్నిక కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితమైనది కాదు. 2028 సాధారణ ఎన్నికలకు ముందస్తు సెమీఫైనల్‌గా, రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీల బలాబలాలను బేరీజు వేసే అసలు సిసలు పరీక్షగా ఇది రూపాంతరం చెందుతుంది. దానం నాగేందర్ అనర్హతతో ఖాళీ అయిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి త్వరలో జరగనున్న ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. 2028 సాధారణ ఎన్నికలకు ఇది సెమీఫైనల్‌గా మారుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఈ పోరును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకోవడంతో పాటు ఫిరాయింపుల రాజకీయాలపై ప్రజా తీర్పును కోరేందుకు సిద్ధమవుతోంది. దానం నాగేందర్ మళ్లీ టికెట్ ఆశిస్తున్నప్పటికీ, అభ్యర్థి ఎంపికపై పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మరోవైపు, కోల్పోయిన




సీటును తిరిగి దక్కించుకోవడంతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్‌కు ఇది కీలక అవకాశం. ఈ పార్టీ నుంచి తలసాని సాయికిరణ్ యాదవ్, దాసోజు శ్రవణ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక 2014లో విజయం సాధించిన బీజేపీ, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వచ్చిన ఆధిక్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్థానంలో మళ్లీ పాగా వేయాలని చూస్తోంది.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సార్) తర్వాత నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య సుమారు 1.86 లక్షలకు చేరింది. ముస్లిం, రెడ్డి, బీసీ ఓటర్లు ఇక్కడ గెలుపు ఓటములను నిర్ణయించడంలో కీలకం కానున్నారు. అనర్హత వేటు పడినప్పటికీ తాను ఏ పార్టీ నుంచైనా బరిలో దిగుతానని దానం నాగేందర్ సంకేతాలు ఇస్తుండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఎంఐఎం మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారగా, కల్వకుంట్ల కవిత పార్టీ (తెలంగాణ రక్షణ సమితి) కూడా పోటీకి సిద్ధమవుతుండటం ఓట్ల చీలికపై ప్రభావం చూపనుంది. షెడ్యూల్ ఇంకా వెలువడక ముందే మూడు ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో కసరత్తు మొదలుపెట్టడంతో, ఖైరతాబాద్ ఉపఎన్నిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై చైనా సుంకాల తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా నుంచి అత్యధికంగా దిగుమతి చేసుకునే సోయాబీన్స్‌ను ఈ మినహాయింపుల జాబితా నుంచి తప్పించింది. దీంతో అమెరికా సోయాబీన్స్‌పై అదనంగా 10 శాతం సుంకం కొనసాగనుంది.చైనా విడుదల చేసిన జాబితాలో మొక్కజొన్న, గోధుమలు, జొన్నలు, మాంసం, పాల ఉత్పత్తులు, కూరగాయల నూనెలు, సోయా నూనె, సోయా మీల్‌తో పాటు పలు వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి. 2024లో ఈ జాబితాలోని వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల వాణిజ్యం సుమారు 17 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు రాయిటర్స్ నివేదిక పేర్కొంది.**సోయాబీన్స్‌పై కొనసాగనున్న భారం** అమెరికా సోయాబీన్స్‌పై అదనంగా 10 శాతం సుంకం కొనసాగనుంది. ఈ సుంకం ప్రైవేటు సోయాబీన్ ప్రాసెసింగ్ సంస్థలకు భారంగా మారే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు చైనా ప్రభుత్వ రంగ సంస్థలు అమెరికా నుంచి సోయాబీన్స్ కొనుగోళ్లను కొనసాగిస్తున్నాయి. సినోగ్రెయిన్, కోఫ్కో సంస్థలు ఇప్పటికే 1.2 కోట్ల టన్నులకు పైగా అమెరికా సోయాబీన్స్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం.**30ఫర్30 జాబితాలు** అమెరికా, చైనాలు పరస్పరం సుంకాల తగ్గింపునకు సంబంధించిన '30ఫర్30' ఉత్పత్తుల జాబితాలను విడుదల చేశాయి. దాదాపు 30 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా సున్నితత్వం లేని ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు చైనా చర్యలు చేపట్టగా, అమెరికా కూడా చైనా నుంచి దిగుమతి చేసుకునే 77 రకాల వస్తువులకు సుంకాల సడలింపులను ప్రకటించింది. ఇరుదేశాలు వాణిజ్య సంబంధాల కోసం ప్రత్యేక వాణిజ్య మండలిని ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయి.అమెరికాచైనా మధ్య ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. అయితే సోయాబీన్స్‌పై అదనపు సుంకం కొనసాగడం ఇరుదేశాల వ్యవసాయ వాణిజ్యంలో కీలక అంశంగా మారింది.

# తొలిసారి కక్ష్యలోకి స్టార్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

విజయాన్ని సాధించింది.ప్రయోగంలో భాగంగా 26 స్టార్‌లింక్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ప్రయోగం అనంతరం సూపర్ హెవీ బూస్టర్ గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో నియంత్రితంగా దిగింది. మరోవైపు స్టార్‌షిప్ పైదశ తన కక్ష్య ప్రయాణాన్ని కొనసాగించింది.చంద్రుడు, అంగారక గ్రహం వంటి సుదూర లక్ష్యాలకు మానవులను, భారీ సరుకులను తరలించే పునర్వినియోగ అంతరిక్ష నౌకగా స్టార్‌షిప్‌ను స్పేస్‌ఎక్స్ అభివృద్ధి చేస్తోంది. ఈ విజయం సంస్థ భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం కనీసం నాలుగేళ్ల విద్యాభ్యాసం ఉండాల్సిందేనని స్పష్టం చేసినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే స్థానికతను నిర్ణయించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది.స్థానికతకు సంబంధించిన నిబంధనలు ఏకపక్షంగా ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ చేసిన వాదనలను పరిశీలించిన అనంతరం, తెలంగాణలో స్థానిక రిజర్వేషన్లకు వర్తించే నిబంధనలు రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోనే ఉన్నాయని స్పష్టం చేసినట్లు సమాచారం. **నాలుగేళ్ల విద్యాభ్యాసం కీలకం**తెలంగాణలో స్థానిక రిజర్వేషన్లకు అర్హతను నిర్ణయించేటప్పుడు విద్యాభ్యాస కాలానికి ప్రాధాన్యం ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో కనీసం నాలుగేళ్లు చదివిన వారికి స్థానిక రిజర్వేషన్లకు అర్హత ఉంటుందని పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంలో గతంలో వెలువడిన సుప్రీంకోర్టు తీర్పులను కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.స్థానికతకు సంబంధించిన నిబంధనలపై గతంలోనూ వివిధ కేసులు న్యాయస్థానాల ముందుకు వచ్చాయి. 2025లో సుప్రీంకోర్టు తీర్పులోనూ తెలంగాణ స్థానిక అభ్యర్థుల నిర్వచనం, విద్యాభ్యాసం, నివాసానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.ఈ తాజా స్పష్టతతో తెలంగాణలో స్థానిక రిజర్వేషన్లకు సంబంధించిన అర్హతలపై మరింత స్పష్టత ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సుల్లో స్థానిక కోటా వర్తింపుపై ఈ నిబంధనల ప్రభావం ఉండనుంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.మృతులను మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి, వెంకటాపూర్‌కు చెందిన అగ్గు సౌందర్య, సోనియా, సుమలతగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# విద్యుత్ బిల్లుతో ట్రాఫిక్ చలాన్లు లింక్ చేయాలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచించినట్లు సమాచారం.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి జారీ చేసిన చలాన్లు పెండింగ్‌లో ఉండటం, వాటి వసూళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులపై విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. చలాన్లను క్రమబద్ధంగా వసూలు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం తెలంగాణలో వాహనదారులు పెండింగ్ చలాన్లను అధికారిక ఈ-చలాన్ వ్యవస్థ ద్వారా పరిశీలించి, ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. తెలంగాణ పోలీసుల అధికారిక ఈ-చలాన్ వ్యవస్థలో వాహన నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వివరాలతో పెండింగ్ చలాన్లను పరిశీలించవచ్చు.చలాన్ల వసూళ్లను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమాచార అనుసంధానం, డిజిటల్ విధానాల వినియోగం వంటి అంశాలు పరిశీలనలోకి వస్తున్నాయి. అయితే విద్యుత్ బిల్లులతో చలాన్లను అనుసంధానించే విధానం అమల్లోకి వచ్చిందని చెప్పడానికి ప్రస్తుతానికి అధికారిక ధ్రువీకరణ అందుబాటులో లేదు.

# నిరసనలకు అడ్డాగా సచివాలయం

(మొదటి పేజీ తరువాయి)

అని ప్రభుత్వాన్ని నిలదీశారు.రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలు ఏమయ్యాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. దశాబ్దాల పాటు సేవలందించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా అని నిలదీశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. సమస్యలపై ఆందోళన చేస్తున్న వారినే పట్టించుకోకపోవడం ప్రజా పాలనా అని ప్రశ్నించారు.

# భగత్ సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

**• దేశం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడి జీవితం యువతకు మార్గదర్శకం: వీరమళ్ళ కార్తీక్ గౌడ్**



**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 28:** స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే భగత్ సింగ్ చేసిన పోరాటం, చూపిన ధైర్యం, చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భగత్ సింగ్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా యువతలో దేశభక్తి, సామాజిక చైతన్యం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించిన గొప్ప వ్యక్తి అని కార్తీక్ గౌడ్ అన్నారు. నేటి యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి, ప్రజా సంక్షేమానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. భగత్ సింగ్ చూపిన ధైర్యం, నిబద్ధత, దేశభక్తి యువతకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నారాయణపూర్ మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ, బీసీ యువజన సంఘం నాయకులు బైకని నరేందర్, సూర్వి వెంకటేశ్, విజయ్, మురళి తదితరులు పాల్గొని భగత్ సింగ్‌కు నివాళులర్పించారు.

# రూ.50 లక్షలతో నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి

**నిరుపయోగంగా మారడంతో బోరు మోటారు చోరీ.. ధ్వంసమైన తాగునీటి నల్లాలు**

**ప్రజావాణిలో అధికారులకు జీఎంపీఎస్ నాయకుల వినతి**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 28:** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో రూర్బన్ మిషన్ ద్వారా 2024లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డును వెంటనే నిర్వహణలోకి తీసుకుని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల ప్రయాసలకు ఓర్చుకుని నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డు ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో గొర్రెల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని, జీవాలకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నల్లాలను సైతం ధ్వంసం చేశారని తెలిపారు. మార్కెట్ యార్డును వినియోగంలోకి తీసుకురావడం ద్వారా గొర్రెలు, మేకల పెంపకందారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి మార్కెట్ యార్డును పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి, తాగునీటి సౌకర్యాలను పునరుద్ధరించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా బోరు మోటారు చోరీ, నల్లాల ధ్వంసానికి బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాల కోసం నిర్మించిన మార్కెట్ యార్డును నిరుపయోగంగా వదిలేయకుండా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా డైరెక్టర్ బండారు నరసింహ, జీఎంపీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ, నాయకులు అవిశెట్టి పాండు, పాక జహం, చౌటుప్పల్ మండల కార్యదర్శి కొండే శ్రీశైలం, మున్సిపల్ కన్వీనర్ గుణమోని ఐలయ్య, సంఘం మండల ఉపాధ్యక్షులు గజ్జి పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా ఎన్ని నెలలు ఆగాలి.. మోడల్ స్కూల్ రోడ్డు కోసం?

**శిలాఫలకం దిమ్మ వేసి రెండు నెలలు.. ఇంకా ప్రారంభం కాని పనులు**

**విద్యార్థి అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బందులు**

**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 28:** చౌటుప్పల్ మోడల్ స్కూల్ రోడ్డు నిర్మాణం కోసం శిలాఫలకం దిమ్మ ఏర్పాటు చేసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై స్థానికులు, ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థినికి ఇటీవల కడుపునొప్పి రావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి విద్యార్థినిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని కోరారు. దీంతో ఆటోలో విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు బయలుదేరగా, రోడ్డు అధ్వానంగా ఉండటంతో పాటు ఫ్లైఓవర్ పనుల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయని ఆటో డ్రైవర్ తెలిపారు. సాధారణంగా తక్కువ సమయంలో చేరాల్సిన ఆసుపత్రికి విద్యార్థినిని తీసుకెళ్లేందుకు సుమారు 20 నిమిషాల సమయం పట్టిందని ఆయన పేర్కొన్నారు. "ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు పరిస్థితి కారణంగా ఆలస్యం జరగడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్లు ప్రతిరోజూ ఈ రోడ్డుపైనే ఆధారపడుతున్నారు. శిలాఫలకం దిమ్మ ఏర్పాటు చేసి రెండు నెలలు కావస్తున్నా పనులు ఎందుకు ప్రారంభం కాలేదో అధికారులు సమాధానం చెప్పాలి. ఇకనైనా మోడల్ స్కూల్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి" అని ఆటో డ్రైవర్ కోరారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నా యని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.



# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

**• డా. సూర్కంటి శ్రీధర్ రెడ్డి. ఏం టెక్. పి. హెచ్.డి. ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు యాదాద్రి భువనగిరి జిల్లా**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 28:** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని సూర్కంటి శ్రీధర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సూర్కంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలు జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా ఓటరు నమోదును పూర్తి చేయాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని అన్నారు. అదేవిధంగా, ఎన్నికలు జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా తమ ఓటు నమోదును వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు తమ పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, వారు కూడా నిర్ణీత గడువులోగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులే కీలకం

**ఇబ్బందులు ఉంటే చెప్పండి.. పరిష్కరిస్తాం.. చేయలేకపోతే వెళ్లిపోండి**

**బాధ్యతాయుతంగా పనిచేయాలి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 28:** గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, చెత్త సేకరణ, చెత్త నిల్వ కేంద్రాల నిర్వహణపై సమీక్షించారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన అభివృద్ధి పనుల అంచనాలు సిద్ధం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనిచేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును ప్రతి నెలా సమీక్షిస్తానని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని వారి వల్ల గ్రామాల అభివృద్ధి ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. పనితీరు మెరుగుపరుచుకుని బాధ్యతా యుతంగా పనిచేయాలని సూచించారు.

**వేసవిపై ముందస్తు ప్రణాళిక** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న బహుళ ప్రయోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, పంచాయతీ కార్య దర్శులు, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డిండి పథకం రద్దు వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 28:** డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ఉప్పు కృష్ణ డిమాండ్ చేశారు. దేవరకొండ, మునుగోడు ప్రాంతాలు దశాబ్దాలుగా సాగునీటి సమస్యలు, ఫ్లోరోసిస్ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ ప్రాంతాల ప్రజలకు సాగునీరు అందించేందుకు డిండి పథకం కీలకమని పేర్కొన్నారు. పథకాన్ని పూర్తి చేసి కాలువలు, చెరువులకు నీరు అందించాలని కోరారు. డిండి పథకంపై కోదండరాం వ్యాఖ్యలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించాలని, ప్రాంత ప్రజల సాగునీటి హక్కులపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా ఏకమై పోరాడాలని ఉప్పు కృష్ణ పిలుపునిచ్చారు.

# ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ఉద్యమకారులకు ధన్యవాదాలు



**తొలి అక్షరం/వలిగొండ, సెప్టెంబర్ 28:** ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఉద్యమకారుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వారి ఆకాంక్షలను నెరవేర్చి ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు.

# రామన్నపేటలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 28:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం (28.09.2026) మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఏ.రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మండల ప్రజావాణి నోడల్ అధికారి అయిన ఎంపీడీఓ విడుదల చేసిన హాజరు జాబితా ప్రకారం మొత్తం 31 మంది అధికారులకు గాను 22 మంది హాజరయ్యారు. హాజరైన వారిలో ఎంపీడీఓ ఏ.రాములు, తహసీల్దార్ సి.లాల్ బహదూర్, ఎంపీఓ ఎండీ రఫీ, ఏఓ శ్రీనివాస్ గౌడ్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ ఆశిష్ రాఘవ, మెడికల్ ఆఫీసర్ ఎం.బేబీ శాలిని, వెటర్నరీ అసిస్టెంట్ డా.కె.జ్యోత్స్న, ఎస్ఐ ఆఫ్ పోలీస్ జి.సతీష్ మినహా, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫైర్ డిపార్ట్మెంట్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. గైర్హాజరైన అధికారుల వివరాలను ఎంపీడీఓ జిల్లా అధికారులకు నివేదించారు. అందులో అడిషనల్ ఛార్జ్ ఏఈ(పీఆర్) సందీప్ రెడ్డి వలిగొండ ఎంపీపీ కార్యక్రమానికి హాజరైనట్లు, హౌసింగ్ ఏఈఈ కె.సురేష్ సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్హెచ్ఓ జి.సతీష్ కూడా గైర్హాజరైనట్లు నివేదికలో తెలిపారు.




**6 ఫిర్యాదులు స్వీకరణ:** ప్రజావాణిలో మొత్తం 6 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. అందులో తహసీల్దార్ కు 4, ఇరిగేషన్ శాఖ ఏఈఈ సుచరితకు 1, డీఎం నల్గొండకు సంబంధించిన 1 దరఖాస్తు వచ్చినట్లు అప్లికేషన్ స్టేటస్ రిపోర్ట్ లో పేర్కొన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని ఎంపీడీఓ ఏ.రాములు తెలిపారు.

## బస్సు సర్వీసు పునరుద్ధరణకు
# గ్రామాల ఐక్యత

● గుంతల రహదారి నుంచి మంచి బస్సు బాటకు హామీ



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 28:** పెద్ద కొర్పోల్ మీదుగా పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసు పునఃప్రారంభానికి గ్రామస్థులు సహకరించారు. అంబాల రామగోపాల్ కృషికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్టీసీ అధికారులు సహకరించారు.బస్సు మార్గంలో చెట్లు, ముళ్లపొదలు తొలగించి, గుంతలు పూడ్చేందుకు సర్పంచులు, యువజన, మహిళా సంఘాలు ముందుకు వచ్చాయి. ప్రజా అవసరం కోసం రాజకీయ భేదాలను పక్కనపెట్టి గ్రామాలన్నీ ఏకమై బస్సు సర్వీసు పునరుద్ధరణకు కృషి చేయడం అభినందనీయమని గ్రామ పెద్దలు తెలిపారు.కార్యక్రమంలో అంబాల శాంత రామగోపాల్‌గౌడ్, రామానుజన్ వెంకటేశ్వర్లు, దయ్యాల ఐలయ్య, మెండే బుచ్చయ్య, పెండ్యాల కుమారస్వామి, కంటం రామస్వామి, కోరే వెంకన్న, దయ్యాల ప్రభాకర్, మట్టే శ్రీనివాస్, బొడ్డుపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


# కరాటేలో ఇండియన్ హైట్స్ విద్యార్థుల సత్తా

● హరిష్‌కు రెండు స్వర్ణాలు.. రిత్వికాకు రెండు కాంస్యాలు



**తొలి అక్షరం/షాద్‌నగర్, సెప్టెంబర్ 28:** షాద్‌నగర్ ఇండియన్ హైట్స్ స్కూల్ విద్యార్థులు కరాటేలో ప్రతిభ చాటి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఆరో తరగతి విద్యార్థి ఎం. హరిష్ హైదరాబాద్‌లో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో కరాటే కటా ప్రదర్శనలో పాల్గొని రికార్డు సాధనలో భాగస్వామ్యమయ్యాడు.ముంబైలో జరిగిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కటా, కుమిటే విభాగాల్లో హరిష్ రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. మూడో తరగతి విద్యార్థిని రిత్వికా రెడ్డి ఇదే పోటీల్లో రెండు విభాగాల్లో మూడో స్థానాన్ని సాధించింది.విజేతలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి అభినందించింది. కార్యక్రమంలో చైర్మన్ సజ్జల భువనేశ్వర్, వైస్ చైర్మన్ ద్రాక్షాయణి, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ సునీత, కరాటే మాస్టర్ సాయినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కరాటే శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని వారు తెలిపారు.

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



**తొలి అక్షరం/దంతాలపల్లి సెప్టెంబర్ 28:** దంతాలపల్లి గ్రామంలోని ఒకటో వార్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది నిత్యం ప్రజలు ఈ దారికుండ రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు విరిగి పడుతుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని సానికలు విజ్ఞప్తి చేస్తారు

# జానపద కళాకారునికి ఘనసన్మానం

● చేసిన మహబూబ్ నాయక్ తండా గ్రామ సర్పంచ్ బానోతు మంజుల మిట్టు నాయక్





**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 28:** వరంగల్ జిల్లా..నెక్కొండ మండలం మహబూబ్ నాయక్ తండ లో మాజీ వార్డ్ నెంబర్ బట్టు కిషన్ కి సన్మానం చేసిన గ్రామ సర్పంచ్ బానోతు మంజుల మిట్టు అలాగే సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రతిభా పురస్కార్ అవార్డు 2025లో జానపద రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు భట్టు కిషన్ ని సన్మానించడం మనందరికీ ఎంతో గర్వకారణం వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం, మహబూబ్‌నాయక్ తండా గ్రామానికి చెందిన భట్టు కిషన్ జానపద కళారంగంలో అందిస్తున్న సేవలకు ఈ పురస్కారం ఒక గొప్ప గుర్తింపు.మన గ్రామానికి, మన మండలానికి, మన జిల్లాకు పేరు తీసుకువచ్చిన భట్టు కిషన్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు.ఇలాంటి మరెన్నో పురస్కారాలు అందుకోవాలని, జానపద కళారంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మహబూబ్ నాయక్ తండ గ్రామానికి ఇది నిజంగా గర్వకారణమైన విషయశీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బట్టు సురేష్ కుమార్ మాజీ సర్పంచ్ మాలోతు పూర్ణ,కారోబార్ నరేష్, బాబు రాజేందర్, శ్రీను, శ్రీనివాస్ మంజులాల్, విక్రమ్ వీరన్న యాకు ధర్మ అరుణ సునీత తదితరులు పాల్గొనడం జరిగింది.

# నిజమైన కార్యకర్తకు గుర్తింపు ఎక్కడ..?

**తొలి అక్షరం/రామన్నపేట, సెప్టెంబర్ 28:** విశ్లేషణ: రాజకీయాల్లో నాయకులు పార్టీలు మారుతుంటారు.. కానీ నిజమైన కార్యకర్త మాత్రం కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోస్తూనే ఉంటాడు. నిన్నటి వరకు ఒక పార్టీని విమర్శించిన నాయకుడు కండువా మార్చగానే కీలక పదవులు పొందుతున్నా.. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తకు మాత్రం గుర్తింపు దక్కడం లేదనే ఆవేదన వినిపిస్తోంది.నాయకుడు పార్టీ మారగానే తనతో ఉన్న కార్యకర్తలను మరిచిపోవడం, అదే పార్టీలో కొనసాగుతున్న వారిని ప్రత్యర్థులుగా చూడటం మరింత బాధాకరమని కార్యకర్తలు అంటున్నారు. పదవుల కోసం సిద్ధాంతాలను పక్కనపెట్టే నాయకత్వం వల్ల కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోంది.నిజమైన కార్యకర్త నాయకుడి కోసం కాకుండా ప్రజల కోసం, పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేయాలి. పార్టీలు కూడా కష్టకాలంలో జెండా మోసిన కార్యకర్తలను గుర్తించి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. కండువా మార్చి వచ్చిన వారికంటే.. కండువా కోసం ఏళ్ల తరబడి శ్రమించిన కార్యకర్తకు గుర్తింపు దక్కాలి అనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.


# రామన్నపేట తహసీల్దార్‌కు దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకం అందజేత



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 28:** రామన్నపేట తహసీల్దార్‌ను విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.అశోక్ దివ్యాంగుల సమస్యలను తహసీల్దార్ కు వివరించి, దివ్యాంగుల హక్కుల చట్టం-2016 పుస్తకాన్ని అందజేశారు.దివ్యాంగుల హక్కులు, విద్య, ఉపాధి, రిజర్వేషన్లపై అధికారులకు, ప్రజలకు అవగాహన అవసరమని ఫోరం కోరింది. గ్రామీణ దివ్యాంగులకు పథకాలపై అవగాహన కల్పించాలని, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షురాలు గొరికే రేణుక, సహాయ కార్యదర్శి గుండ్లపల్లి నాగేశ్వర్ పాల్గొన్నారు.

# మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి సిఐటియు ఆర్థిక సహాయం

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 28:** మరణించిన గ్రామ పంచాయతీ కార్మికుడు గొర్ల నాగరాజు కుటుంబానికి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు.నాగరాజు దశదినకర్మ సందర్భంగా సిఐటియు రామన్నపేట మండల కమిటీ నుండి రూ.9 వేలు, 25 కిలోల బియ్యాన్ని అందించారు. నాగరాజు కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, డబ్బుల్లేక సరైన వైద్యం చేయించుకోలేక మృతి చెందాడని నాయకులు తెలిపారు. ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం, ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేదని, తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరికంటి రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మండల అధ్యక్షులు గాదె ఎల్లయ్య, ముత్యాల సాయిలు, స్వామి, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.




# చౌటుప్పల్‌లో రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

● రేపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

● ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి:

● చౌటుప్పల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 28:** చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో సుమారు రూ.15 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.శంకుస్థాపన కార్యక్రమానికి పురపాలక సంఘం చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డు అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోశిక వినయ్ కోరారు.చౌటుప్పల్ పురపాలక సంఘం అభివృద్ధికి అందరి సహకారం అవసరమని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు.

# నెక్కొండలో మున్సిపల్ కోర్టు ఏర్పాటు చేయాలి




**తొలి అక్షరం/నెక్కొండ, సెప్టెంబర్ 28:** రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా మంజూరవుతున్న 200 మున్సిపల్ కోర్టుల్లో ఒకదాన్ని నెక్కొండలో ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ మాజీ ట్రిబ్యునల్ సభ్యుడు ఘటిక అజయ్‌కుమార్ కోరారు.నర్సంపేట నియోజకవర్గంలోనే నెక్కొండ అతిపెద్ద మండలమని, 39 గ్రామాలు ఉన్న మండలంలో ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉందని తెలిపారు. మండలానికి సంబంధించిన అనేక న్యాయవివాదాలు ఉన్నందున ప్రజలకు సౌకర్యంగా ఉండేలా నెక్కొండలో మున్సిపల్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో తాటిపల్లి శివకుమార్, అబ్దుల్ నభి, సారంగపాణి, దాసరి శ్రీనివాస్, బొల్లపల్లి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక దినోత్సవ పోటీలలో డిస్ట్రిక్ట్ సెకండ్ బహుమతి సాధించిన క్రిష్ణవేణి విద్యార్థులు



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 28:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ డిస్ట్రిక్ సెకండ్ ప్రైజ్ సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎస్.శరణ్ తేజ్, ఎల్. విశ్వ సాయి, ఎస్ శ్రీకారుణ్య, తస్లీం ఖానం, ఈ. శ్రీవిద్య తదితరులు జిల్లా పర్యావరణ మరియు టూరిజం శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ మురళి ని కరెస్పాండెంట్ తో పాటు ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె వి ఎన్ ఎస్ మణి అభినందించారు.

# కుంకుడుపాముల గ్రామంలో విబిజీ రాంజీ గ్రామసభ - విలేజ్ మ్యాపింగ్‌తో అభివృద్ధికి ప్రణాళిక

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 28:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని కుంకుడుపాముల గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ జీ రాంజీ కార్యక్రమంలో భాగంగా గ్రామసభను ప్రశాంత వాతావరణంలో, ప్రజల ఉత్సాహపూరిత భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నీటి పారుదల వసతులు, మౌలిక సదుపాయాలను గుర్తించేందుకు గ్రామ ప్రజలు స్వయంగా గ్రామ నమూనా (విలేజ్ మ్యాపింగ్) ను రూపొందించారు. రహదారులపై రంగులతో గ్రామ పటాన్ని వేసి, ఊరి భవిష్యత్తు ప్రణాళికలను చర్చించారు. ఈ నమూనా ఊరి భవిష్యత్తు ప్రణాళికలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్ , వార్డు మెంబర్లు, పంచాయతీ సెక్రటరీ, టెక్నికల్ అసిస్టెంట్ తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామసభను జయప్రదం చేశారు.





# మరుగున పడుతున్న కాకతీయ కళాఖండం

**-14వ శతాబ్దపు శివాలయ పునర్నిర్మాణానికి విరాళాల ఆహ్వానం**




**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొర్పోల్ గ్రామంలో 14వ శతాబ్దానికి చెందిన పురాతన కాకతీయ శివాలయాన్ని పునర్నిర్మించేందుకు విరాళాలు సేకరిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి భక్తులు తమ శక్తి మేరకు సహకరించాలని నిర్వాహకులు కోరారు.పురాతన ఏకశిలా కళాఖండమైన శివలింగం, నంది విగ్రహం ఉన్న ఈ ఆలయాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విరాళాలు అందించే భక్తుల పేర్లను శాశ్వతంగా శిలాఫలకంపై లిఖించనున్నట్లు తెలిపారు.చిన్నకొర్పోల్ గ్రామస్తులతో పాటు భక్తులందరూ ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములై కాకతీయుల నాటి చారిత్రక కళాఖండాన్ని కాపాడాలని కోరారు.

# చదరంగంలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థి సత్తా.. వేదాదిత్యకు ద్వితీయ స్థానం

**• చెస్ విజేత వేదాదిత్యకు ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా ఘన సన్మానం... అభినందనలు**






**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 28:** చదరంగ పోటీల్లో కృష్ణవేణి పాఠశాల విద్యార్థి వేదాదిత్య ప్రతిభ చాటాడు. షాద్‌నగర్ పట్టణంలోని పతంజలి యోగ సెంటర్‌లో షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్2026 పోటీల్లో అండర్12 విభాగంలో వేదాదిత్య ద్వితీయ స్థానం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. తన ప్రతిభతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు.వేదాదిత్య సాధించిన విజయాన్ని పురస్కరించుకుని కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పాఠశాల ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా విద్యార్థికి ట్రోఫీ, సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. అలాగే చెస్ మాస్టర్ వానరాసి జగన్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ.. చదరంగం విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కృష్ణజింక వేట.. తొమ్మిది మంది అరెస్ట్

**• 13 కిలోల మాంసం, తుపాకీ, బుల్లెట్లు స్వాధీనం**




**తొలి అక్షరం/షాద్ నగర్,సెప్టెంబర్28:** కృష్ణజింకను వేటాడి చంపి, దాని మాంసాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్న తొమ్మిది మందిని షాద్‌నగర్ పోలీసులు, ఎస్‌వోటీ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా మరికల్ అటవీ ప్రాంతంలో కృష్ణజింకను వేటాడిన నిందితులు మాంసాన్ని ముక్కలుగా నరికి ప్యాక్ చేసి రెండు వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం అందడంతో రాయకల్ టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుల నుంచి .315 రైఫిల్, టెలిస్కోప్, సైలెన్సర్, 19 బుల్లెట్లు, సుమారు 13 కిలోల కృష్ణజింక మాంసం, నల్లటి స్కార్పియో, సుజుకి ఎస్-క్రాస్ వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.28,590 నగదు, రెండు టార్చ్‌లైట్లు, క్యానన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. నింది తులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని 9, 39, 50, 51, 57 సెక్షన్లతో పాటు ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలి పారు. వన్యప్రాణుల వేటకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీసీపీ శిరీష రాఘవేంద్ర హెచ్చరించారు.



# డిజిటల్ కటిక చీకట్లను చీల్చేద్దాం

**• ఒక్క ఫోన్ వెలుగుతో సైబర్ మాయగాళ్లను తరిమేద్దాం • వృద్ధులే వారి లక్ష్యం..రక్షించడమే బ్యూరో లక్ష్యం • వేగమే కాదు..అప్రమత్తతే ముఖ్యం • ఫోన్ ఫ్లాష్‌లైట్లతో చైతన్య రథంగా మారనున్న హైదరాబాద్ • అక్టోబర్ 1న నెక్లెస్ రోడ్‌లో సైబర్ ఫ్లాష్ సమరభేరి • టిజిసిఎస్బి డైరెక్టర్, ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్**








**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్28:** పెరుగుతున్న డిజిటల్ వినియోగంతో పాటు సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, ప్రజల భద్రతే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్బి) కదం తొక్కింది.అక్టోబర్ నెలను అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన నెలగా పురస్కరించుకుని కుటుంబాల కోసం డిజిటల్ భద్రత అనే ప్రధాన అంశంతో నెల రోజుల పాటు భారీ ప్రచారాన్ని చేపడుతున్నట్లు టిజిసిఎస్బి డైరెక్టర్, ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్ వెల్లడించారు. ఈ అవగాహన మహోద్యమానికి శ్రీకారం చుడుతూ అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద 2 కిలోమీటర్ల భారీ సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ నైట్ వాక్ నిర్వహించనున్నారు. సైబర్ నేరగాళ్లు భయాన్ని, అత్యవసర పరిస్థితిని సృష్టించి ప్రజలను తొందరపాటు నిర్ణయాలు తీసుకునేలా చేస్తారు.అందుకే ప్రతి ఒక్కరూ..ఆగండి.. ఆలోచించండి..అడుగు వేయండి అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలి.ఏదైనా లింక్‌పై క్లిక్ చేసే ముందు, వ్యక్తిగత సమాచారం ఇచ్చే ముందు లేదా డబ్బులు పంపే ముందు ఒక్క క్షణం ఆగి ఆలోచించడం ద్వారా మోసాల నుండి తప్పించుకోవచ్చు.ఈ ఆగే శక్తి డిజిటల్ ప్రపంచంలో పెద్ద రక్షణ కవచంలా పనిచేస్తుంది అని శిఖా గోయల్ పేర్కొన్నారు. నైట్ వాక్‌లో పాల్గొనే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తమ ఫోన్ల ఫ్లాష్‌లైట్లను ఆన్ చేసి నడవాలని,ఇది సైబర్ చైతన్యానికి,అప్రమత్తతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అంతేకాకుండా,సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న వృద్ధుల రక్షణ కోసం ఏడాది పొడవునా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.అక్టోబర్ 31న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎస్పీల ఆధ్వర్యంలో ముగింపు వాక్‌లు నిర్వహించనున్నారు.ఈ మహోద్యమంలో భాగస్వాములు కావడానికి https://tgcsb.tspolice.gov.in/cybersecurity`flash/ వెబ్‌సైట్‌లో ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.ఒకవేళ ఆర్థిక సైబర్ మోసం జరిగి ఉంటే, తక్షణమే 1930 జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని టిజిసిఎస్బి డైరెక్టర్, ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్ స్పష్టం చేశారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబరు28:**
అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని నాచారం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన వ్యక్తి మల్లాపూర్ భవానీ నగర్‌లో నివాసముంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మల్లాపూర్ జనప్రియ లేన్ సమీపంలోని బాలజీ ధాబా ఎదురుగా ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అక్కడ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న సదరు నిందితుడిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా,అతని వద్ద 14 ప్యాకెట్లలో ఉన్న 70 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో అతడిని అరెస్టు చేసి, గంజాయితో పాటు నేరానికి ఉపయోగించిన స్కై బ్లూ రంగు వివో వై-16 మొబైల్ ఫోన్, టీవీఎస్ స్పోర్ట్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, వీటి సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు.

# విషనాగులాంటి డ్రగ్స్ జోలికెళ్తే...భవిష్యత్తు శూన్యమే

**• కన్నవారి ఆశలను సమాధి చేయకండి • సెక్టార్ ఎస్సై మధు • రామంతాపూర్ అవే మరియా పాఠశాలలో అవగాహన సదస్సు**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబరు 28:** మత్తు పదార్థాలు అలవాటు కావు జీవితాలను క్షణాల్లో బూడిద చేసే విషనాగులు సరదా కోసమో, క్షణికావేశంలోనో వాటి జోలికెళ్తే కన్నవారి కలలు సమాధి కావాల్సిందే అని రామంతాపూర్ సెక్టార్ ఎస్సై మధు అగ్నిపర్వతంలా విరుచుకుపడ్డారు. రామంతాపూర్‌లోని అవే మరియా పాఠశాలలో డ్రగ్స్ మహమ్మారి సమాజంపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు గురువారం అత్యంత శక్తిమంతమైన, చైతన్యవంతమైన అవగాహన సదస్సు జరిగింది. సెక్టార్ ఎస్సై మధు,హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థుల నరనరాల్లో చైతన్యాన్ని రగిలించేలా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధు మాట్లాడుతూ...డ్రగ్స్ అనే మహమ్మారి మీ శరీరాలను,మనస్సులను మాత్రమే కాదు...మీ భవిష్యత్తును, మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాన్ని నాశనం చేస్తుంది అని అన్నారు.ఒక్కసారి మత్తు వలలో చిక్కుకుంటే శారీరక వైకల్యం,మానసిక వికలత్వంతో పాటు చట్టం ముందు నేరస్థులుగా నిలబడి జీవితాంతం పశ్చాత్తాపపడాల్సి వస్తుంది అని తెలిపారు.డ్రగ్స్ వాడినా,సరఫరా చేసినా కఠినమైన జైలు శిక్షలు తప్పవు అని హెచ్చరించారు.ఈ విషయంలో చట్టం ఎవరినీ క్షమించదు అని ఖరాఖండీగా స్పష్టం చేశారు. యువత ఒత్తిడికి తలొగ్గి చెడు మార్గాల వైపు అడుగులు వేయకూడదని హితవు పలికారు.మీ చుట్టుపక్కల కానీ,మీ స్నేహితుల్లో కానీ ఎవరైనా ఈ మురికి కూపంలో పడినా,డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిసినా భయం విడిచి వెంటనే పోలీసులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ కబురు అందించండి అని కోరారు.మీరు ఇచ్చే చిన్న సమాచారం ఒక మనిషి ప్రాణాన్ని,ఒక కుటుంబాన్ని నిలబెడుతుంది అని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపల్ జయ ప్రతాప్, ఉపాధ్యాయ బృందం,వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పెసల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**- రైతులను దళారుల నుంచి కాపాడాలి: భూక్యా వీరభద్రం**



**తొలి అక్షరం/కొణిజర్ల, సెప్టెంబర్ 28:** వైరా మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం వైరా ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సుంకర సుధాకర్, హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



# ఉద్యోగులపై ఏఐ పంజా

మనిషికి మనిషిని శత్రువు చేసింది కృత్రిమమేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీఏఐ). సమాచార సాంకేతిక(ఐటీ) రంగంలో పెను విప్లవాన్ని సృష్టిస్తూ లక్షలాది ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. గతంలో ఉద్యోగుల కోత ప్రధానంగా ఆర్థిక మాంద్యం, అధిక వడ్డీ రేట్లు, కోవిడ్ అనంతర పరిణామాలు కారణమవగా, ప్రస్తుతం కృత్రిమమేధ, ఆటోమేషన్ సాంకేతికతలు కారణమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సందిగ్ధ పరిస్థితులు, ఉద్యోగులపై వ్యయాల తగ్గింపు, కృత్రిమమేధపై పెట్టుబడుల కోసం అమెజాన్, ఒరాకిల్, మెటా వంటి దిగ్గజ టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగింపును అంచెలంచెలుగా చేపడుతున్నాయి. ఈ ఏడాది మొదలు ఆగస్టు నెలవరకు 289 కంపెనీలు లేఆఫ్ ప్రకటించి, 1,23,305 మంది ఉద్యోగస్తులను తొలగించాయి. గత ఏడాదిలో 278 కంపెనీలు 1,22,606 మంది ఉద్యోగులను తొలగించగా, ఈసారి ఎనిమిది నెలల్లోనే ఆ సంఖ్యకు మించిన ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఖర్చులను తగ్గించుకోవడం, సంస్థలో వ్యవస్థలను సరళీకరించడం, కృ త్రిమ మేధతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉన్న ఇతర రంగాలకు పెట్టుబడులను మళ్లించడంతో ఉద్యోగాల కోతలు పెరుగుతున్నాయి. అత్యధిక కంపెనీలు టీమ్లను విలీనం చేయ డం, మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, కొన్ని రకాల పనులను ఆటోమేట్ చేయడం, కృత్రిమ మేధ దిశగా టీమ్లను పునర్వ్యస్థీకరించడం వంటి చర్యలు చేపడుతున్నాయి.కృత్రిమ మేధను ప్రయోగాత్మక సాంకేతికతగా కాకుండా తమ వ్యాపార నిర్మాణంలో కీలక భాగంగా పరిగణిస్తుండడంతో సంస్థను చాలా వరకు కుదించుకుంటున్నారు. ఉత్పాదకతను పెంచడం, ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే ఈ మార్పులు ప్రధానంగా కస్టమర్ సపోర్ట్, ఆడ్మినిస్ట్రేషన్, బ్యాక్ఆఫీస్ కార్యకలాపాలు వంటి వైట్ కాలర్ ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. రోజురోజుకీ కృత్రిమ మేధ వినియోగం విస్తరిస్తుండడంతో ఉద్యోగాల స్వరూపంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా అమెజాన్, ఉబర్, ఇంటెల్, ఒరాకిల్, డెల్, మెటా వంటి సంస్థలను పేర్కొనవచ్చు. పేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్‌ను నుంచి 8 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఐరోపా, అమెరికా, సింగపూర్‌లలో కొందరు ఉద్యోగులకు 'ఇంటి నుంచి పని'కి అవకాశం కల్పించి, తదుపరి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు 'ఈమెయిల్' ద్వారా సమాచారాన్ని మెటా పంపించింది. ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాల్లో ఉద్యోగుల కోత ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది.ఈ తొలగింపు ఇక్కడితో ఆగకుండా ముందు ముందు మరింత మందిని తొలగించనున్నట్లు హెచ్చరికలు జారీ చేసింది. కృత్రిమ మేధ వ్యవస్థలపై వంద బిలియన్ డాలర్ల మూలధనాన్ని వెచ్చించనుంది. కృత్రిమ మేధా ఆధారిత కార్యకలాపాలపై దృష్టి సారించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన బృందాలలోకి ఏడు వేల మంది సిబ్బందిని మెటా బదిలీ చేసింది. వేగంగా, జవాబుదారీతనంతో పనిచేసే చిన్న బృందాలతో ముందుకు వెళ్లానుకుంటున్నట్లు ఉద్యోగులకు ఇంటర్నల్ మెమోలో మెటా పేర్కొంది. అమెజాన్ అత్యాధునికి కృత్రిమ మేధ మోడళ్లు, ఉత్పత్తుల అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో సిబ్బందిపై వేటు వేసింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 16 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇదేబాటలో ఉబర్ సంస్థ కస్టమర్ సర్వీస్ విభాగంలో పది శాతం ఉద్యోగులను తగ్గించుకుంది. కార్యకలాపాలను సరళీకరించడం, కృత్రిమ మేధని అందిపుచ్చుకోవడంతో ఉద్యోగ కోత అనివార్యమైందని సంస్థ తెలిపింది. గ్లోబల్ టెక్ దిగ్గజంగా రాణిస్తున్న ఒరాకిల్ సంస్థ కృత్రిమ మేధా సాంకేతికతపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు తన వ్యాపార వ్యూహాల్లో భాగంగా పొదుపు చర్యలకు పాల్పడింది. దీంతో 21 వేల మంది ఉద్యోగులను తొలగించినట్లు సంస్థ తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. క్లౌడ్, ఏఐ విభాగాలను బలోపేతం చేసే క్రమంలో డెవలప్‌మెంట్ గ్రూపును పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. ఏఐ మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా డేటా సెంటర్ల నిర్మాణానికి ఈ ఏడాది కనీసం 50 బిలియన్ డాలర్ల పెట్టుబడిని కేటాయించింది. మైక్రోసాఫ్ట్ కూడా ఉద్యోగుల పనితీరును సమీక్షించే ప్రక్రియనుచేపట్టింది. ఇదే తరహాలో చిన్న, మధ్యతరహా సాఫ్ట్‌వేర్ సంస్థలలో ఉద్యోగులను కుదించుకుంటోంది. కృత్రిమ మేధతో ఉద్యోగాలలో కోత కారణంగా ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతాయని ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా, ఫ్రాన్స్, యూకే, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా... భారత్, బ్రెజిల్ తదితర దేశాల్లో మాత్రం కోత పెద్దగా ఉండక పోవచ్చునన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. భారత్ దృష్టికోణం ఇతర దేశాలకంటే భిన్నంగా ఉంది. భవిష్యత్ పరిణామాలపై కృత్రిమ మేధ ఎటువంటి ప్రభావం చూపిస్తుందనే అంశంపై భారత్‌లో ఎక్కువ మందికి సరైన అవగాహన లేకపోవడం ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. కోల్పోతున్న ఉద్యోగాల కంటే కొత్తగా పుట్టుకొచ్చే ఉద్యోగుల సంఖ్య భారత్‌లో ఎక్కువగా ఉంది. ఆసియాలో ఉపాధి పరిణామాలను విశ్లేషించిన అంతర్జాతీయ ఆర్థిక పరిశోధన సంస్థ నోమురా తాజా నివేదిక పేర్కొంది. ప్రతి ఒక్క ఉద్యోగం నష్టపోతుంటే, దానికి బదులుగా 2.6 కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్లు తెలిపింది. కృత్రిమ మేధ ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలను కొల్లగొడుతుందనే ఆందోళనల మధ్య ఈ నివేదిక రావడం దేశీయ ఐటీ రంగంలో సరికొత్త చర్చకు దారితీసింది.కృత్రిమ మేధ విప్లవంలో భారతీయులు తమ ఉత్పాదకతను పెంచుకుంటే, అంతర్జాతీయ మార్కెట్లో మరిన్ని ఉన్నత స్థాయి ప్రాజెక్టులను దక్కించుకునే అవకాశం ఉంటుందని వివరించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా శ్రామిక శక్తిని నూతన సాంకేతిక రంగాలవైపు మళ్లించడం, వారికి తగిన శిక్షణ అందించడమే ప్రస్తుతమున్న అతిపెద్ద సవాల్‌గా పేర్కొంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాలకు అత్యధిక డిమాండ్ ఉంటుందని తెలిపింది. ఇదిలావుండగా, కృత్రిమ మేధ కంపెనీలు మనుషుల జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆంత్రోపిక్ కృత్రిమ మేధ పరిశోధకుడు జాకబ్ కోక్సన్ పేర్కొన్నాడు. బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ ఒక సూపర్‌ఇంటెలిజెన్స్ అభివృద్ధి రేసులో పరుగులు తీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. దేనినైనా హ్యాక్‌చేసే సూపర్‌హ్యూమన్ వ్యవస్థల దిశగా సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, రాత్రికి రాత్రి ఏ రంగంలోనైనా ఇది విప్లవాన్ని తీసుకొస్తుందన్నారు. మన శక్తిని, వనరులను లాగేసుకుంటుందని, ఏ ఇతర మానవ చర్య కూడా తలపెట్టలేనంత ప్రమాదాన్ని కృత్రిమ మేధ తీసుకురాగలదని వివరించారు.

# వినబడటం లేదా.. బొద్దింకల రణన్నినాదం?


శుక్రవారంనాడు కొన్ని జాతీయ ఆంగ్ల దినపత్రికలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోతో 'ఇండియా రోర్స్ లౌడర్ దాన్ ఎవర్' అంటూ ఒక ఆకర్షణీయమయిన వ్యాపార ప్రకటనను ప్రచురించాయి. భారతదేశం మునుపెన్నడూ లేనంత బిగ్గరగా గర్జిస్తున్నదని దానర్థం. ఇది ప్రధానమంత్రికి అత్యంత ప్రియమయిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి సంబంధించిన ప్రకటన. ఉత్పత్తులు పెంచడంలోనో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలోనో ఈ గర్జన బిగ్గరగా వినిపిస్తే అందరికీ సంతోషమే. ఇవాళ భారత్ మునుపెన్నడూ లేనంత బిగ్గరగా గర్జిస్తున్నది, ఏమని? కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్ట్ చేసి విచారణ జరపాలని. కోట్లాదిమంది ఓట్లను తొలగించడం ద్వారా పాల్పడిన చోరీ కేసులో ఆయనను అరెస్ట్ చెయ్యాలని ప్రతిపక్షాలు పట్టుబట్టుతున్నాయి.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం 2025 లో బీహార్ రాష్ట్రంతో ప్రారంభించి మొత్తం 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముసాయిదా ఓటర్ల జాబితా నుండి 13 కోట్లకు పైగా పేర్లను తొలగించింది. ఈ సంఖ్య ఒక చిన్న దేశ జనాభాతో సమానం. ఈ చర్య దేశంలో ఎవరికి ఓటు హక్కు కల్పించాలో, ఎవరి ఓట్లు తొలగించాలో నిర్ణయించే గురుతర బాధ్యత నిర్వర్తించవలసిన వ్యవస్థ విశ్వసనీయత మీద నీలినీడలు పరిచింది. ఓట్లు తొలగించాలని నిర్ణయించిన కారణాలను అధికారికంగా వెల్లడించే ప్రయత్నం జరగకపోవడం దుర్మార్గం. మాట మాట్లాడితే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయపక్షానికి చెందినవారు 'గుస్పేటి' అనే ఒక పదం వాడుతుంటారు. అంటే చొరబాటుదారులు అని అర్థం. నిజంగానే పొరుగు దేశాలనుండి ఇంత పెద్ద సంఖ్యలో చొరబడ్డారా? అప్పుడు మన నిఘా వ్యవస్థ, భద్రతా దళాల సామర్థ్యం ప్రశ్నార్థకం కావడం లేదా? ఇలాంటి బాధ్యతగల స్వతంత్ర వ్యవస్థలకు పారదర్శకత అవసరం కదా, ఆ చొరబాటుదారుల పేర్లు దేశ ప్రజల ముందు పెట్టరు ఎందుకని?.లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దాదాపు సంవత్సర కాలంగా ఈ వ్యవహారంలో జరిగిన అవకతవకలు, అక్రమాలమీద పెద్దయెత్తున ప్రచారం సాగించినా జనాన్ని జాగరూకులను చేసేందుకు ప్రయత్నిస్తున్నా రాని ఫలితం 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' దినపత్రిక రాసిన పరిశోధనాత్మక కథనంతో సాధ్యమైంది. కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ఈ వ్యవహారంలో ఎన్ని అభ్యంతరాలు చెప్పినా 'ప్రతిపక్షాల పని అయిపోయింది, ప్రజలు వారితో లేరు' అని కొట్టిపారేస్తూ వచ్చిన భారతీయ జనతా పార్టీ గొంతులో ఈ వార్తతో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఈ వార్తకు ఆధారాలు ఏమిటనే ఒక బలహీనమయిన వాదన కొద్దిమంది అధికారపక్ష నేతల చేత మీడియా ముందు వినిపింపజేస్తున్నారే తప్ప అటు ప్రధానమంత్రి కానీ, ఇటు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ కానీ తమ వైపునుండి ఎటువంటి తప్పూ జరగలేదని ప్రజల



ముందుకొచ్చి వివరించే ప్రయత్నం, వారిలో నమ్మకం కల్పించే ప్రయత్నం చెయ్యడం లేదు. దానికి కారణం ఉంది. ఒకటి కాదు చాలా తప్పులు జరిగాయి.'ఇండియన్ ఎక్స్ ప్రెస్' దినపత్రిక కథనం ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు అధికారికంగా లేవనెత్తిన అభ్యంతరాల ఆధారంగా రాసినది. పలు అంశాలలో తమ దృష్టికి రాకుండానే నిర్ణయాలు జరిగిపోయాయనీ, వాటిలో కొత్త ఓటర్లను చేర్చుకోవడం, ఉన్న ఓటర్లను తీసివెయ్యడం వంటి చర్యలు కూడా ఉన్నాయని ఆ ఇద్దరు కమిషనర్లు ఫిర్యాదు చేసారు. రాష్ట్రాలస్థాయిలో ఉన్న అధికారుల ప్రమేయం లేకుండా కొత్త ఓటర్ల నమోదును కేంద్రీకృతం చెయ్యడం చట్టవ్యతిరేకమనేది ఆ ఇద్దరి వాదన. ఈ విషయంలో ఈ ఇద్దరు కమిషనర్లు క్యాబినెట్ కార్యదర్శికి మొరపెట్టుకున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధ వ్యవస్థ. అది స్వతంత్రంగా పనిచెయ్యాలి. క్యాబినెట్ కార్యదర్శి శరణు వేడారంటేనే అది కేంద్రప్రభుత్వం చెప్పుచేతల్లోకి ఎంతగా వెళ్ళిపోయిందో అర్థం అవుతోంది.గత పది మాసాల కాలంలో ఆ ఇద్దరు కమిషనర్లు కనీసం 14 సందర్భాలలో తమ అభ్యంతరాలను అధికారికంగా తెలియజేయడమే కాకుండా ఒకే రోజున వారు తమకు తెలియకుండా ఉత్తర్వులు జారీ అయినందుకు నాలుగుసార్లు అభ్యంతరాలు లేవనెత్తారు. అయినా కమిషనర్ల గోడు పట్టించుకున్న నాథుడు లేడు. పట్టించుకోవలసిన చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇంకెవరి ఆదేశాలనో అమలుచేసే పనిలో తలమునకలై ఉన్నారు. ఆయనను చీఫ్ కమిషనర్ గా నియమించడం కోసమే 2023 లో చట్టసవరణ చేసి భారత ప్రధానన్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రిని సభ్యుడిగా చేర్చుకున్నప్పుడు ఆ మాత్రం స్వామిభక్తి ప్రదర్శించకపోతే ఎలా అని అనుకుని ఉంటారాయన. కేంద్ర ఎన్నికల సంఘంలో జరుగుతున్న ఈ వ్యవహారం బయటపడటంతో ఇప్పుడు దేశ యువత, విద్యార్థులు మరో జంతర్ మంతర్ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యారు. జెన్ జీకి ప్రతినిధిగా ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ విద్య గురించి కదా పట్టించుకోవాలి, రాజకీయాలతో వాళ్లకేం పని అంటూ అధికారపక్షం సన్నాయినొక్కులు ప్రారంభించింది. ఈ దేశ ప్రజల అత్యంత ప్రధానమైన ఓటుహక్కు విషయంలో ఇంత దుర్మార్గం జరుగుతుంటే వాళ్లకు (జెన్ జీకి) కాక ఇంకెవరికి పట్టాలి? అందుకే వాళ్ళు మళ్ళీ బయటికి వస్తున్నారు. 'కాక్రోచెస్ వాపస్ ఆవో' నినాదం అధికారంలో ఉన్నవారిని హైరానాకు గురిచెయ్యక తప్పదు.జెన్ జీ ప్రతినిధిగా ఉన్న కాక్రోచ్ జనతా పార్టీ మూడు డిమాండ్లను ముందుకు తెచ్చింది. మొదటిది చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, రెండవది 2023 లో ఆ పదవికి నియామకం కోసం చేసిన కొత్తచట్టాన్ని రద్దు చెయ్యడం, మూడవది కేంద్ర ఎన్నికల సంఘం ప్రక్షాళన జరిగేవరకు వచ్చే ఏడాదికాలంలో జరగాల్సిన రాష్ట్రాల ఎన్నికలను నిలిపివెయ్యడం. ఈ మూడు కోరికలూ సమంజసమైనవే. ఇంతజరిగాక జ్ఞానేశ్ కుమార్ ను ప్రతిపక్షాలు కోరుతున్నట్టు అరెస్ట్ చేసి కేసు పెట్టకపోయినా, ఆయన కనీస నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చెయ్యాలి. ప్రస్తుతం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఉన్న జ్ఞానేశ్ కుమార్ 2023 కొత్త నియామక చట్టం కింద నియమితులైన తొలి సీఈసీ. ఆ చట్టం ప్రకారం నియామక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రి ఉండటంతో అప్పటినుంచే ఈ వ్యవస్థ స్వతంత్రతపై చర్చ మొదలైంది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసుల విచారణ ఇంకా కొనసాగుతోంది. నిజమే, ఇంత లోపభూయిష్టమైన వ్యవస్థను పెట్టుకుని ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా ఎలా జరుగుతాయి? వచ్చే ఏడాది ఎన్నికలన్నీ వాయిదా వెయ్యాల్సిందే. ఇంత జరిగాక ముగ్గురు ఎన్నికల కమిషనర్లు తాజాగా సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కానక్కరలేదంటూ మినహాయింపు ఇవ్వడం విచిత్రం. ఇంతకాలం తమ ఓటు హక్కు కాపాడుకునేందుకు ఓటర్లు పడిన అష్టకష్టాలకు బాధ్యత ఎవరు వహిస్తారు? గత కొంతకాలంగా దేశంలో ఇందుకు సంబంధించి నెలకొన్న పరిణామాలలో మూడు అంశాల గురించి తప్పనిసరిగా చర్చించుకోవాలి. మొదటిది, ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ ఎదిగివచ్చిన తీరు, ఆయన పరిణతి చెందుతున్న తీరు. రాహుల్ గాంధీకి 57 ఏళ్ళు వచ్చినా ఇంకా రాజకీయ చరిత్ర తెలియదని విమర్శిస్తున్నవాళ్ళూ, రిటైర్మెంట్ దగ్గర పడింది ఇంకేం రాజకీయాలు చేస్తాడని గొణుగుతున్నవాళ్ళు 57 సంఖ్యను తిరగేస్తే వచ్చే 75 ఏళ్ళ వయసు దాటుతున్నవాళ్ళు ఈ దేశ విశ్వసనీయత ప్రపంచం ముందు పరిహాసం పాలయ్యే పనులు జరుగుతుంటే ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని గుర్తు చేసుకొంటే మంచిది.రెండవది ప్రధాన స్రవంతి మీడియా అని మనం చెప్పుకునే వ్యవస్థ అధికారం ముందు సాగిలపడుతున్న వాతావరణంలో ఒక చిన్న ఆశగా 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' కేంద్ర ఎన్నికల సంఘం బండారాన్ని బయట పెట్టే పరిశోధనాత్మక కథనం ప్రచురించడం. మూడవది, ఆఖరుది ఈ దేశ రాజకీయాలను కూడా ప్రక్షాళన చేసేందుకు జెన్ జీ నడుం బిగించడం. అవును భారతదేశపు యువత మునుపెన్నడూ లేనంత బిగ్గరగా గర్జిస్తున్నది.

# పర్యాటకంతో సమ్మిళిత అభివృద్ధి

ప్రపంచ దేశాల్లో 5వ అతి పెద్ద పర్యాటక మార్కెట్ కలిగిన దేశంగా భారత్ నిలుస్తూ వచ్చే ఏడాది నాటికి 3వ అతి పెద్ద పరిశ్రమగా పర్యాటకాన్ని నిలపడానికి జోరుగా పథక రచనలు, అమలు జరుగుతుండడం హర్షదాయకం. భారత పర్యాటక రంగంలో సాంస్కృతిక, సాహస, పర్యావరణ లేదా ఎకో, వైద్య, వంట, క్రీడ, గ్రామీణ, ఆధ్యాత్మిక, వ్యాపార పర్యాటక విభాగాలు దేశ వైవిధ్యత, వారసత్వ సంపద, సమాజ అందాలను పర్యాటకులకుకనుల విందు చేస్తున్నాయి. దేశ ఆర్థికాభివృద్ధి, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, స్థానిక ఆర్థిక పరిపుష్టి, ఉద్యోగ కల్పన, జిడిపీలో వృద్ధి, ప్రాంతీయ అభిభివృద్ధి, సాంస్కృతుల సంరక్షణ, విదేశీ మారక ద్రవ్యం, సాంస్కృతిక వినిమయం, మౌళిక వనరుల కల్పన లాంటి ప్రయోజనాలతో పర్యాటకం దేశ అభ్యున్నతికి తన వంతు బాధ్యతను నిర్వహిస్తున్నది. 2024 ట్రావెల్ టూరిజం అభివృద్ధి సూచిక ప్రకారం 119 దేశాల జాబితాలో భారత్కు 39వ స్థానం కల్పించబడింది. ఇదే జాబితాలో 2021లో భారత దేశ స్థానం 54గా నమోదు అయ్యింది.పర్యాట పరిశ్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి ఆ రంగాన్ని దినదినం సమగ్రాభివృద్ధి చేయడం, దేశ ఆర్థికానికి ఊపిరులూదడం, సంస్కృతి వారసత్వ సంపదలను కాపాడడం, దేశ విదేశీ పర్యాటకులన ప్రోత్సహించడం లాంటి అంశాలను అవగాహన కల్పించడానికి యూఎన్ వరల్ టూరిజమ్ ఆర్గనైజేషన్ చొరవతో, ఆ సంస్థ ఏర్పడిన రోజును గుర్తించి ప్రతి ఏట 27 సెప్టెంబర్ రోజుల ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించడం జరుగుతున్నది. స్వతంత్ర భారతంలో ఇంక్రెడిబుల్ ఇండియా లేదా అపురూప భారతం అనే నినాదంతో పర్యాటక రంగానికి పెద్ద



పూట వేయాలని భావించి ప్రతి ఏట 25 జనవరి రోజున జాతీయ పర్యాటక దినం పాటించడం జరుగుతోంది. ప్రపంచ పర్యాటక దినం-2026 ఇతివృత్తంగా డిజిటల్ ఎజెండా, కృత్రిమ మేధతో పర్యాటకాన్ని పునర్-రూపక్పన (డిజిటల్ ఎజెండా అండ్ ఏఐ టి రీడిజైన్ టూరిజం) అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పర్యాటక పరిశ్రమ విస్తరణతో ఆయా ప్రాంతాల అన్ని వర్గాల ప్రజలు లాభపడడంతో సమ్మిళిత అభివృద్ధి సుసాధ్యం అవుతున్నది.2019లో భారతంలో పర్యాటక ద్రవ్య వినియోగం 127 బిలియన్ డాలర్లు ఉండగా, 2023లో 174 బిలియన్ డాలర్లకు పెరిగింది. పర్యాటక పరిశ్రమతో దేశ ఆర్థికాభివృద్ధి ఎంతగానో జరుగుతున్నది. దేశ పర్యాటక పరిశ్రమ గత ఏడాది రూ:21 ట్రిలియన్లు జిడిపీకి జమకాగా, 43 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడి, 2023-24లో 2.3 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించడం విశేషంగా చెప్పుకోవాలి. భారత పర్యాటకంలో 65 శాతం వరకు తమిళనాడు, యూపీ, మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ అనే ఐదు రాష్ట్రాలు మాత్రమే నమోదు చేసుకుంటున్నాయి.

వైవిధ్యభరిత భారతంలో తాజ్మహల్, అజంతా ఎల్లోరా గుహలు, మహాబలిపురం, హంపీ, హవా మహల్, ఆగ్రా ఫోర్ట్, చార్మినార్ లాంటి ప్రధాన ప్రదేశాలతో పాటు పుష్కర ఫేర్లు, తాజ్ మహోత్సవ్, సూరజ్ కుండ్ మేళా, కుంభ మేళా లాంటివి కూడా విశేషంగా దేశ విదేశ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రయాగ్ రాజ్లో నిర్వహిస్తున్న 45 రోజుల మహా కుంభ మేళాకు దాదాపు 40 కోట్ల భక్తులు హాజరు అవుతారని అంచనా వేశారు. వీటికి తోడుగా అందమైన బీచ్లు, హిల్ స్టేషన్స్, అద్భుత వారసత్వ కట్టడాలు, సుందర సహజ ప్రకృతి కమనీయాలు, మనసును మెప్పించే బ్యాక్వాటర్ అలలు, ఆధ్యాత్మిక కేంద్రాలు దేశ పర్యాటక పరిశ్రమకు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయి.భారత ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పలు పర్యాటక ప్రోత్సాహక పథకాలను ప్రకటిస్తూ, ఆచరణలో పెట్టడంతో ఈ రంగం దినదినాభివృద్ధిని నమోదు చేసుకుంటున్నది. మౌళిక వసతుల కల్పన, సేవల విస్తరణ, దేశ విదేశీ పర్యాటకాలను ఆకర్షించడం లాంటి లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి ఇంక్రెడిబుల్ ఇండియా 2.0, స్వదేశీ దర్శన్ పథకం, దేఖో అప్నా దేశ్, ప్రసాద్ స్కీమ్, నిచే టూరిజం, ఈ-విసా సౌకర్యం, జిఎస్టి తగ్గింపు, నిధిం డిజిటల్ పథకం లాంటివి ఆచరణలో పెట్టబడినవి. ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన, స్థానిక ప్రదేశాల అభివృద్ధి, మౌళిక వసతుల పెంపు, లాంటివి పర్యాటక పరిశ్రమతో సుసాధ్యం కావడం వల్ల ఆ రంగాన్ని మరింత విస్తరించడానికి ప్రభుత్వాలతో పాటు సాధారణ పౌర సమాజం కూడా తమ వంతు కర్తవ్యాలను నిర్వహించి మేరా భారత్ మహాన్ అంటూ నినదిద్దాం, భరతమాత సౌందర్యాన్ని ఇనుమడింపజేద్దాం.

# ఆసియా క్రీడలు.. తొమ్మిదో రోజు భారత్‌కు మరో రెండు పతకాలు



ఆసియా క్రీడల్లో తొమ్మిదో రోజు భారత్‌కు మరో రెండు పతకాలు వచ్చాయి. షూటింగ్‌లో రజతం, కురాష్‌లో కాంస్య పతకలదదక్కాయి. ఇక బాక్సింగ్‌లో స్టార్ బాక్సర్ లవ్లీనా పతకం ఖాయం చేసుకుంద. ప్రస్తుతం భారత్ 39 పతకాలతో 12వ స్థానంలో ఉంది. ఇందులో నాలుగు స్వర్ణాలు, 17 రజతాలు, 18 కాంస్యాలు ఉన్నాయి. షూటింగ్ వ్యక్తిగత విభాగంలో భారత్ షూటర్ సింగ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. 25 మీటర్ల వ్యక్తిగత విభాగంలో చైనాకు చెందిన జియో జియోరుక్సాన్‌తో గోల్డ్ కోసం ఇషా పోటీ పడింది. చివరివరకూ ఇద్దరి స్కోర్ సమంగా ఉండటంతో షూట్ ఆఫ్ నిర్వహించారు. ఇందులో చైనా గెలిచి స్వర్ణం గెలుచుకుంది. దీంతో ఇషా సింగ్‌కు రజతం సొంతమైంది.

# బంతి పడలేదు.. టీమిండియా సెమీస్‌కు చేరింది



వర్షం కొట్టేసింది.. సెమీస్‌కు టీమిండియా హైదరాబాద్: ఆసియా క్రీడలలలో వర్షం కారణంగా భారత్--అఫ్ఘానిస్థాన్ మధ్య జరగాల్సిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. బెస్ట్ ర్యాంకింగ్ ప్రకారం టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆసియా క్రీడల నాకౌట్ మ్యాచ్‌ల నిబంధనల ప్రకారం వర్షం లేదా ఇతర కారణాలతో మ్యాచ్ రద్దయితే, ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా మెరుగైన జట్టు సెమీస్ కు చేరుతుంది. ప్రస్తుతం భారత్ ప్రపంచ నంబర్-1 టీ20 జట్టుగా ఉండగా, అఫ్గానిస్థాన్ 10వ స్థానంలో ఉంది. దీంతో ఫలితం లేకుండానే భారత్ తదుపరి దశకు వెళ్లింది.హాంగ్‌జౌలోనూ ఇదే నిబంధన 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లోనూ భారత్‌కు ఇదే నిబంధన కలిసొచ్చింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఫైనల్ వర్షం కారణంగా రద్దవడంతో ర్యాంకింగ్ ప్రకారం భారత్ స్వర్ణ పతకాన్ని సాధించింది. అఫ్గాన్‌పై అజేయంగా భారత్ టీ20 క్రికెట్‌లో అఫ్గానిస్థాన్‌పై భారత్ ఇప్పటివరకు ఓటమి చవిచూడలేదు. ఇరు జట్ల మధ్య జరిగిన 13 మ్యాచ్‌ల్లో టీమిండియా 11 విజయాలు సాధించింది. మరో రెండు మ్యాచ్‌లు ఫలితం లేకుండా ముగిశాయి. ఈ రెండు కూడా ఆసియా క్రీడల్లోనే జరిగాయి.=పాక్ కూడా సెమీస్‌లోకి మరో క్వార్టర్‌ఫైనల్లో పాకిస్థాన్--హాంకాంగ్ చైనా మ్యాచ్ కూడా భారీ వర్షం కారణంగా రద్దయింది. మెరుగైన సీడింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ బుధవారం జరిగే సెమీఫైనల్లో బంగ్లాదేశ్--మలేషియా మ్యాచ్ విజేతతో తలపడనుంది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్.. శ్రీలంక--నేపాల్ మ్యాచ్ విజేతతో ఆడనుంది. దీంతో ఆసియా క్రీడల ఫైనల్లో మరోసారి భారత్--పాకిస్థాన్ క్రికెట్ పోరు జరిగే అవకాశం ఉంది. భారత మహిళల క్రికెట్ జట్టు ఇప్పటికే ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది.

# పోలికలు వద్దు.. సచిన్ పాజీకి ప్రత్యేక స్థానం ఉంది: కోహ్లీ




తిరువనంతపురం: సచిన్ తనకు ఎప్పటికీ సచిన్ పాజీనే అని రన్ మిషన్ విరాట్ కోహ్లీ తెలిపాడు. సచిన్ ఆడే సమయంలో క్రికెట్ లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని, అది గణాంకాలు, పోలికలకు మించిన విషయమని ప్రశంసించారు. అలాగే ఎంఎస్ ధోనీ తన తొలి కెప్టెన్‌గా ఎప్పటికీ ప్రత్యేకమేనని కోహ్లీ వివరించాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన అనంతరం సచిన్ టెండూల్కర్‌తో తనను పోల్చడంపై విరాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ విషయాలు తన మనసులో ఎప్పటికీ నిలిచిపోతాయని, తాను సాధించాల్సిందంతా సాధించేశానని, ఒక స్థాయికి చేరుకున్నానని ఎప్పుడూ భావించలేదన్నాడు.ఇక చాలు తాను సాధించేశాను అనే భావన తనలో ఎప్పుడ లేదన్నారు. ఇతరుల కంటే తానే గొప్ప అనే భావన ఉండకూడదని, అహంకారానికి చోటివ్వకూడదని తెలియజేశారు. కష్టపడి, వినయంగా ఉంటూ, సరైన రీతిలో సన్నద్ధమై, క్రీడలో సరైన పనులు చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. తాను అందరికంటే గొప్పవాడినని విర్రవీగినచో అప్పుడే ప్రయాణం ముగిసినట్లేనని అని కోహ్లీ చెప్పాడు. అభిమానులు చూసే కోహ్లీ వేరు, తనని తాను చూసుకునే విరాట్ వేరు అని తెలిపారు. అభిమానులు తన ఆటను, ప్రదర్శనలను దూరం నుంచి చూసి ఒక ప్రత్యేకమైన ప్రతిరూపాన్ని ఏర్పరుచుకున్నాడన్నారు. తన ప్రదర్శనలు, దేశం కోసం తాను ఆడిన క్రికెట్ ద్వారా మాత్రమే అభిమానులకు తెలుసునని, కానీ తాను ఎక్కడి నుంచి వచ్చానో తనకు తెలుసనని, మనం ఎప్పటికీ మన అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదన్నారు. ఇతరులు తనని చూసే కోణంలో తనని తాను అసలు చూసుకోనని కోహ్లీ పేర్కొన్నాడు.వెస్టిండీతో జరిగని మ్యాచ్ లో విరాట్ కోహ్లీ 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సర్లతో 139 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో కోహ్లీ మరో అరుదైన రికార్డు జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌ను అధిగమించాడు. రన్‌ఛేజ్‌లో అత్యధిక విజయాల్లో భాగమైన ఆటగాళ్ల జాబితో కోహ్లీ మూడో స్థానంలో ఉన్నాడు. భారత్ రన్‌ఛేజ్ చేస్తూ గెలిచిన వన్డేల్లో కోహ్లీ ఇప్పటివరకు 112 విజయాల్లో జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. రికీ పాంటింగ్ తన జట్టు తరఫున రన్‌ఛేజ్ విజయాల్లో 111 సార్లు భాగమయ్యాడు. దీంతో కోహ్లీ అతడిని అధిగమించి ఈ జాబితాలో మూడో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ 127 విజయాలతో అగ్రస్థానంలో ఉన్నాడు. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 116 విజయాల తో రెండో స్థానంలో ఉన్నాడు. తరువాత వరసగా రికీ పాంటింగ్(111), రోహిత్ శర్మ, జక్వాస్ కలిస్(110) ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 శతకాల సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిం చాలనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ప్రస్తు తం కోహ్లీ ఖాతాలో 86 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో మరో అరుదైన ఘనత కూడా కోహ్లీ ఖాతాలో చేరింది. భారత్‌లో జరిగిన వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్‌ను కోహ్లీ అధిగమించాడు. సచిన్ భారత్‌లో 164 వన్డేల్లో 6,976 పరుగులు చేశాడు. ఆ రికార్డును అధిగమించేందుకు కోహ్లీకి మరో 110 పరుగులు అవసరం కాగా, వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఆ లక్ష్యాన్ని దాటేశాడు.




# కోహ్లీ అరుదైన మైలురాయి

వెస్టిండీస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మరో చారిత్రాత్మక మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్ లో మెరుపు సెంచరీ చెలరేగిన కోహ్లీ.. వన్డేల్లో 15,000 పరుగుల మార్క్‌ను దాటిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈ మైలురాయిని 303 ఇన్నింగ్స్‌లలోనే చేరుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 15,000 వన్డే పరుగులు పూర్తి చేయడానికి 377 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. దీంతో 15,000 వన్డే పరుగుల మార్క్‌ను అత్యంత వేగంగా అందుకున్న బ్యాటర్‌గా కోహ్లీ రికార్డు సాధించాడు. కాగా, ఈ మ్యాచ్ లో విండీస్ జట్టుపై 8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించారు.

# ఆసియా క్రీడల్లో భారత్ పతక జోరు




నగోయా (జపాన్): ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే భారత్ ఏడు పతకాలు సాధించింది. అథ్లెటిక్స్‌లో ఐదు, స్క్వాష్‌లో రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. మరోవైపు బాక్సింగ్‌లో ముగ్గురు భారత బాక్సర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోవడంతో పతకాలు ఖాయమయ్యాయి.ఆసియా క్రీడల్లో ఎనిమిదో రోజు ముగిసే సమయానికి భారత్ 4 స్వర్ణాలు, 16 రజతాలు, 17 కాంస్యాలతో మొత్తం 37 పతకాలు సాధించింది. పతకాల పట్టికలో భారత్ 12వ స్థానంలో కొనసాగుతోంది.స్క్వాష్‌లో రెండు రజతాలు:పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్, మహిళల సింగిల్స్‌లో అనహత్ సింగ్ రజత పతకాలు సాధించారు. ఆసియా క్రీడల్లో రజతం సాధించిన తొలి భారత మహిళా స్క్వాష్ క్రీడాకారిణిగా అనహత్ సింగ్ నిలిచింది.అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన భారత్:మహిళల లాంగ్‌జంప్‌లో ఆన్సీ సోజన్ రజతం, పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుమార్ రజతం సాధించారు. పారుల్ చౌదరి, తేజస్విన్ శంకర్, హరిత భద్ర కాంస్య పతకాలు దక్కించుకున్నారు.పతకాలు ఖాయం:అంకుశ్, పర్వీన్, నరేందర్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుని భారత్‌కు మరో మూడు పతకాలను ఖాయం చేశారు



# జావెలిన్‌లో డబుల్ ధమాకా.. శ్రీశంకర్‌కు రజతం

ఐచీ-నగోయా: 18వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాలతో మెరిశారు. పురుషుల లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్ రజత పతకం సాధించగా, జావెలిన్ త్రోలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. యశ్వీర్ సింగ్ రజతం, రోహిత్ యాదవ్ కాంస్యం గెలుచుకున్నారు.లాంగ్‌జంప్ ఫైనల్లో మురళీ శ్రీశంకర్ 8.07 మీటర్లు దూకి రెండో స్థానంలో నిలిచాడు. పోటీలో గాయపడటంతో చివరి రెండు ప్రయత్నాలను చేయలేకపోయాడు. మరో భారత అథ్లెట్ డేవిడ్ సొలొమాన్ 7.70 మీటర్లతో ఏడో స్థానంలో నిలిచాడు.జావెలిన్ త్రోలో యశ్వీర్ సింగ్ 85.72 మీటర్లు విసిరి రజతం సాధించాడు. రోహిత్ యాదవ్ 84.68 మీటర్ల ప్రదర్శనతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. శ్రీలంకకు చెందిన రుమేశ్ పతిరంగ 88.55 మీటర్లతో స్వర్ణం గెలిచాడు. బాక్సింగ్‌లో మరో మూడు పతకాలు ఖాయం బాక్సింగ్‌లో లొవ్లీనా బొర్గొహైన్, ప్రియా గంఘాస్, కపిల్ పొఖారి యా సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

# డబ్ల్యూపీఎల్2027కు రంగం సిద్ధం.. స్టార్ క్రికెటర్లను అట్టిపెట్టుకున్న ఫ్రాంచైజీలు




న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించి ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను ప్రకటించాయి. ఐదు జట్లు తమకు కీలకంగా భావించిన ఆటగాళ్లను కొనసాగిస్తూ వచ్చే సీజన్‌కు జట్లను సిద్ధం చేసుకున్నాయి. దీంతో డబ్ల్యూపీఎల్2027లో మరోసారి స్టార్ క్రికెటర్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. వచ్చే సీజన్‌కు ముందు నిర్వహించనున్న వేలిపై కూడా క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.కీలక ఆటగాళ్లకు కొనసాగింపుడిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ప్రధాన ఆటగాళ్లపై నమ్మకం కొనసాగించింది. కెప్టెన్ స్మృతి మంధానతో పాటు ఎలీసా పెర్రీ, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్ వంటి కీలక ఆటగాళ్లను జట్టులోనే ఉంచుకుంది. గత సీజన్‌లో జట్టు విజయానికి సహకరించిన ఆటగాళ్లను కొనసాగించడం ద్వారా అదే సమతూకాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసింది.ముంబై ఇండియన్స్ కీలక బలగం అలాగే..ముంబై ఇండియన్స్ కూడా తమ స్టార్ ఆటగాళ్లను కొనసాగించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు హేలీ మాథ్యూస్, నాట్ సీవర్-బ్రంట్, అమేలియా కేర్, నికోలా క్యారీ, షబ్నం ఇస్మాయిల్ వంటి ఆటగాళ్లకు చోటు కల్పించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లను కొనసాగిస్తూ జట్టు నిర్మాణాన్ని బలంగా ఉంచింది.యూపీ వారియర్స్ కూడా కీలక ఆటగాళ్లను రిటైన్ చేసిందియూపీ వారియర్స్ తమ జట్టులోని ప్రధాన ఆటగాళ్లను కొనసాగించింది. దీప్తి శర్మ, మెగ్ లానింగ్, ఫోబీ లిచ్‌ఫీల్డ్, సోఫీ ఎకిల్‌స్టోన్ వంటి అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లపై ఫ్రాంచైజీ మరోసారి విశ్వాసం ఉంచింది. దేశీయ, విదేశీ ఆటగాళ్ల కలయికతో జట్టును మరింత పటిష్ఠం చేసుకునే దిశగా అడుగులు వేసింది.గుజరాత్ జెయింట్స్ నుంచి కూడా కొనసాగింపుగుజరాత్ జెయింట్స్ బెత్ మూనీ, యాష్లీ గార్డ్నర్, జార్జియా వేర్‌హామ్, సోఫీ డివైన్ తదితర కీలక ఆటగాళ్లను కొనసాగించింది. అనుభవం ఉన్న ఆటగాళ్లతో పాటు ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చే సీజన్‌కు జట్టును సిద్ధం చేస్తోంది.ఢిల్లీ క్యాపిటల్స్ కీలక ఆటగాళ్లకు అండ ఢిల్లీ క్యాపిటల్స్ కూడా తమ ప్రధాన ఆటగాళ్లను కొనసాగించింది. జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, లారా వోల్వార్ట్, మారిజాన్ కాప్ తదితరులకు రిటెన్షన్ జాబితాలో చోటు కల్పించింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ బలమైన ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడంతో వచ్చే సీజన్‌లో ఢిల్లీ జట్టుపై అంచనాలు కొనసాగుతున్నాయి.వేలిపై భారీ ఆసక్తి ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను ప్రకటించడంతో ఇప్పుడు విడుదలైన ఆటగాళ్లు, వేలిలోకి రానున్న క్రికెటర్లపై దృష్టి నెలకొంది. అక్టోబర్ 28న కొచ్చిలో డబ్ల్యూపీఎల్ వేలం జరగనుంది. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు డబ్ల్యూపీఎల్ సీజన్ నిర్వహించనున్నట్లు సమాచారం. వేలిలో ఫ్రాంచైజీలు తమకు అవసరమైన ఆటగాళ్లను దక్కించుకునేందుకు పోటీ పడనున్నాయి.



# గుల్వీర్ సింగ్ సూపర్ షో.. 1500 మీటర్లలోనూ రజత పతకం

నగోయా: ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ మరోసారి సత్తాచాటాడు. పురుషుల 1500 మీటర్ల పరుగులో రజత పతకం సాధించాడు. సోమవారం జరిగిన ఫైనల్లో గుల్వీర్ 3:36.72 నిమిషాల్లో రేసును పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రదర్శనతో గుల్వీర్ ఈ ఆసియా క్రీడల్లో తన రెండో రజత పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు.చివరి వరకు ఆధిపత్యం1500 మీటర్ల ఫైనల్లో గుల్వీర్ ఆరంభం నుంచే పోటీలో ముందంజలో నిలిచాడు. చివరి ల్యాప్‌లో వేగం పెంచుతూ ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చాడు. ఫినిషింగ్ లైన్ సమీపించే వరకు గుల్వీర్ స్వర్ణం కోసం పోటీలోనే ఉన్నాడు. అయితే చివరి దశలో జపాన్‌కు చెందిన కజుటో ఇజావా అనూహ్యంగా పుంజుకుని గుల్వీర్‌ను అధిగమించాడు. కేవలం 0.37 సెకన్ల తేడాతో ఇజావా స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు.వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగుల్వీర్ 1500 మీటర్ల ఫైనల్లో నమోదు చేసిన 3:36.72 నిమిషాల సమయం అతని వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. రేసు మొత్తం వ్యూహాత్మకంగా సాగినప్పటికీ చివరి ల్యాప్‌లో గుల్వీర్ చూపిన వేగం ఆకట్టుకుంది. చివరి క్షణంలో స్వర్ణం చేజారినా రజతంతో మెరిశాడు.10 వేల మీటర్లలోనూ రజతంఇదే ఆసియా క్రీడల్లో గుల్వీర్ సింగ్ ఇప్పటికే 10,000 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించాడు. తాజాగా 1500 మీటర్లలోనూ రజతం గెలవడంతో ఒకే ఆసియా క్రీడల్లో రెండు రజత పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా నిలిచాడు.1500 మీటర్లలో జపాన్‌కు చెందిన కజుటో ఇజావా స్వర్ణం సాధించగా, గుల్వీర్ సింగ్ రజతం దక్కించుకున్నాడు. మరో జపాన్ అథ్లెట్ నగియా మోరీ 3:37.92 నిమిషాల టైమింగ్‌తో కాంస్య పతకం సాధించాడు.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి మెగాస్టార్ చిరంజీవి..
# పాడ్‌కాస్ట్‌తో సరికొత్త ప్రయాణం!



తెలుగు చిత్రసీమలో దాదాపు 48 ఏళ్లుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త బాటలో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. వెండితెరపై తన మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనదైన ముద్ర వేయనున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఆయన ఒక ప్రత్యేకమైన పాడ్‌కాస్ట్ సిరీస్ చేయబోతున్నారు.తొలుత చిరంజీవి జీవిత ప్రస్థానంపై ఒక డాక్యుమెంటరీని రూపొందించాలని భావించినప్పటికీ, పాడ్‌కాస్ట్ అయితే తన భావాలను మరింత స్వేచ్ఛగా, నేరుగా పంచుకోవడానికి వీలుంటుందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. ఈ వినూత్న ఆలోచనను ఆయన కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెలతో పాటు ప్రముఖ రచయిత బీవీఎస్ రవి ప్రతిపాదించగా, చిరంజీవి వెంటనే అంగీకరించినట్లు సమాచారం.ఇప్పటికే పలు విజయవంతమైన టాక్ షోలకు పనిచేసిన అనుభవం ఉన్న బీవీఎస్ రవి ఈ ప్రాజెక్టుకు రచన, రూపకల్పన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాధారణ ఇంటర్వ్యూలలో పంచుకోని ఎన్నో వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలు, స్టార్‌డమ్ వెనుక ఉన్న శ్రమ, సినీ ప్రస్థానంలోని ఎత్తుపల్లాలను ఈ పాడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి అభిమానులతో పంచుకోనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే విడుదల చేయనుందని తెలుస్తోంది.

# మళ్ళీ అమ్మ సెంటిమెంట్ తో పూరి..

పూరీ జగన్నాథ్.. పేరు వింటేనే ఒక డిఫరెంట్ మేనరిజం, రా యాటిట్యూడ్ గుర్తొస్తాయి. ఆయన హీరోలు సమాజంతో గొడవ పడే విధానం చాలా కొత్తగా ఉంటుంది. కానీ ఈసారి పూరీ తన ట్రాక్ మార్చాడని తెలుస్తోంది. వరుస అప్డేట్స్ తో హీరో బిచ్చగాడిగా ఎలా మారాడు అనే కోణంలో క్యూరియాసిటి క్రియేట్ చేస్తున్నాడు. 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' అనే టైటిల్ తోనే తన మార్క్ చూపించాడు. ఇక లేటెస్ట్ గా మరో గ్లింప్స్ వదిలారు. ఇందులో హీరో యాటిట్యూడ్ కన్నా ఎక్కువగా, ఒక బలమైన మదర్ సెంటిమెంట్ చుట్టూ కథను తిప్పబోతున్నట్లు హింట్ ఇచ్చారు. పూరి సినిమాల్లో మదర్ సెంటిమెంట్ కూడా డిఫరెంట్ గానే ఉంటుంది. చిరుత, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, లోఫర్, రోగ్, లైగర్.. ఇలా ఎక్కువ సినిమాల్లో అమ్మ ఎమోషన్ ను హైలెట్ చేశారు. ఇక ఈ సినిమాలో సీనియర్ నటి జరీనా వహాబ్ తల్లిగా 'జుబేదా' అనే పాత్రలో నటిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో ఆమె క్యారెక్టర్ ను పరిచయం చేసిన విధానం గుండెను మెలిపెట్టేలా ఉంది. ట్రైన్ కింద తలపెట్టి చనిపోదాం అనుకున్నా, ఆ ధైర్యం




సరిపోలేదని, ఆకలితో ప్రాణాలు పోతుంటే ఆఖరికి తన చేతులు అడుక్కోవడానికి ముందుకొచ్చాయని జుబేదా పాత్ర చెప్పే డైలాగ్స్ చాలా బరువైన ఎమోషన్‌ను క్యారీ చేస్తున్నాయి. దీని తర్వాత విజయ్ సేతుపతి ఎంట్రీ ఇవ్వడం చూస్తుంటే తల్లి కోసం ఏమైనా చేస్తాడా అనే క్యూరియాసిటి క్రియేట్ అయ్యింది. 'అమ్మ ఉన్నది అన్నం పెట్టడానికి, అడుక్కోవడానికి కాదు' అని పూరి వాయిస్ ఓవర్ హైలెట్ అయ్యింది. అంటే ఆకలి కోసం బిచ్చగత్తెగా మారిన ఒక తల్లి, ఆ తల్లి పడే బాధను చూడలేక రగిలిపోయే కొడుకు.. ఈ ఇద్దరి మధ్య పూరీ జగన్నాథ్ ఎలాంటి కథను రాశాడో అని ఆలోచిస్తే చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది. కచ్చితంగా ఈసారి పూరీ తన మార్క్ మాస్ ఎలిమెంట్స్‌కు ఒక గట్టి సెంటిమెంట్‌ను జోడించబోతున్నట్లు కనిపిస్తోంది. చివరగా ఇస్మార్ట్ శంకర్ లాంటి ఊర మాస్ సినిమాతో హిట్ కొట్టిన పూరీ, ఆ తర్వాత వరుస పరాజయాలతో ఇబ్బంది పడ్డాడు. కానీ ఈసారి ఆ తప్పులు జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఈ గ్లింప్స్ క్వాలిటీ చూస్తే తెలుస్తోంది. ముఖ్యంగా పూరీ డైలాగ్స్‌లో ఉండే పదును ఈ వీడియోలోనూ తగ్గలేదు. ఛార్మి కౌర్, జేబీ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో పూరీ మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరి ఈ ప్రయోగం ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలి. టబు కూడా ఇందులో ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు.

# టెక్నాలజీ, మన కథలు... ఇదే భారత సినిమా భవిష్యత్తు : నాగ్ అశ్విన్

భారీ బడ్జెట్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'తో జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటిన దర్శకుడు నాగ్ అశ్విన్, భారత సినిమా భవిష్యత్తుపై తన ఆలోచనలను పంచుకున్నారు. మన దేశానికే ప్రత్యేకమైన కథలు, పురాణాలకు ఆధునిక టెక్నాలజీని జోడించడం ద్వారా భారత సినిమా సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇటీవల 'కల్కి' చిత్రానికి 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో భాగంగా ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో అవార్డులు లభించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. "మన కథలు, మన తత్వశాస్త్రానికి టెక్నాలజీని జోడించడం ద్వారా భారతీయ సినిమాకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. ఇది కచ్చితంగా నిజం" అని ఆయన స్పష్టం చేశారు.టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం వల్ల మరింత మంది సృజనకారులు తమ ఆలోచనలను తెరపైకి తీసుకురాగలరని నాగ్ అశ్విన్ అన్నారు. "ఈ సాంకేతికత ఎంత సులభంగా అందుబాటులోకి వస్తే, అంత వైవిధ్యమైన, అసలైన గొంతుకలకు బలం చేకూరుతుంది. ఇది ఎక్కువ మంది తమ కథలను తమదైన రీతిలో చెప్పడానికి వీలు కల్పిస్తుంది" అని ఆయన వివరించారు.'కల్కి 2898 ఏడీ' 2024లో విడుదలైన ఒక మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ చిత్రం. హిందూ పురాణాల స్ఫూర్తితో, 2898 నాటి కాశీ నగరంలో ఈ కథ నడుస్తుంది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, శోభన వంటి భారీ తారాగణం ఇందులో నటించారు. శేఖర్ కమ్ముల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన నాగ్ అశ్విన్, 2018లో నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తీసిన 'మహానటి' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే.




# సూర్యతో సినిమాపై నోరు విప్పిన రాజమౌళి



ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని చాటిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, విలక్షణ నటుడు సూర్య కాంబినేషన్‌లో సినిమా వస్తే చూడాలని అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబోపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. సూర్యతో సినిమా చేస్తే అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా (స్పెషల్) ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఆ విషయం గురించి మాట్లాడటానికి ఇది సరైన సమయం కాదని సున్నితంగా దాటవేశారు.ఇటీవల మలయాళ నటుడు ఫహాద్ ఫాసిల్ నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' అనే సినిమా ప్రీ-రిలీజ్ వేడుకకు రాజమౌళి, సూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు రాజమౌళి సమాధానమిచ్చారు. "మీరు ఈ ప్రశ్న అడుగుతారని ఊహించే ఇక్కడికి వచ్చాను. దానికి సమాధానం కూడా సిద్ధం చేసుకున్నాను. కానీ, మనం ఇక్కడికి వచ్చింది 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాను ప్రమోట్ చేయడానికి. ఇప్పుడు నేను, సూర్య సినిమా గురించి మాట్లాడితే, అదే హెడ్‌లైన్ అవుతుంది. అసలు సినిమా పక్కకు వెళ్లిపోతుంది. అది సరికాదు" అని అన్నారు.అదే సమయంలో అభిమానులకు భరోసా ఇస్తూ.. "మేమిద్దరం కలిసి ఎప్పుడు సినిమా చేసినా, అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా ఉంటుంది" అని చెప్పడంతో సూర్య అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అంతటితో ఆగకుండా సూర్యను రాజమౌళి అభినందనలతో ముంచెత్తారు. ఇటీవల 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి చిత్రాలతో వరుస విజయాలు సాధించడం 'డబుల్ ధమాకా' అని ప్రశంసించారు. అలాగే, జితూ మాధవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న 'సీన్' సినిమా ప్రచార చిత్రాలు కూడా అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు.గతంలో రాజమౌళి దర్శకత్వంలో నటించే ఒక అవకాశాన్ని తాను కోల్పోయానని, ఆయనతో కలిసి పనిచేయాలని ఉందని పలు ఇంటర్వ్యూలలో సూర్య స్వయంగా చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాజమౌళి వ్యాఖ్యలతో ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రావడం ఖాయమనే అంచనాలు మరింత బలపడ్డాయి.

# అది హనుమాన్ టెంపుల్ కాదు..
## శిరీష్ ఫిర్యాదుపై పోలీసులు!



హీరో అల్లు శిరీష్ చేసిన డీజే సౌండ్ ఫిర్యాదుపై సైబరాబాద్ పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి వరకు భారీ శబ్దాలతో ఇబ్బంది కలుగుతోందంటూ శిరీష్ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ శబ్దాలకు హనుమాన్ ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై అల్లు శిరీష్‌తో మాట్లాడినట్లు పోలీసులు వెల్లడించారు. సదరు శబ్దాలు గణేశ్ నిమజ్జనం ఊరేగింపు నుంచి వచ్చాయని, హనుమాన్ ఆలయం నుంచి కాదని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులతో కూడా చర్చించామని, ఇప్పటికే నిమజ్జనం పూర్తయిందని వారు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.కొన్ని రోజుల క్రితం, తన నివాసం సమీపంలోని ఒక హనుమాన్ ఆలయం వద్ద అర్ధరాత్రి వరకు డీజే సౌండ్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారంటూ అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేశారు. ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు లోతుగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించారు. పోలీసుల తాజా వివరణతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.



# ఫౌజీ' బ్యూటీ సౌండింగ్ లేదే!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న -పౌజీ- సినిమాలో ఛాన్స్ అందుకుని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది ఇమ్మాన్వీ ఇస్మైల్. డార్లింగ్ సరసన నటించాలని ఎంతో మంది ఫేమస్ బ్యూటీలో రేసులో ఉన్నా? వాళ్లందర్నీ పక్కనబెట్టి మరీ దర్శకుడు హను రాఘవపూడి ఇమ్మాన్విని ఎంపిక చేసారు. అందుకు తగ్గట్టే అమ్మడు మంచి ట్యాలెంటెడ్. డాన్సింగ్ స్కిల్స్ తో ఇప్పటికే లక్షల్లో ఫాలోవర్లను సంపాదించుకుంది. నటన పరంగా అమ్మడు ఎలాంటి పెర్ఫార్మర్ అన్నది పౌజీతో ప్రూవ్ అవ్వాలి. ఈ బ్యూటీ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో మెరిసిన క్షణం నుంచి టాలీవుడ్ వ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. హను రాఘవపూడి కథానాయికలను వెండితెరపై ఎంత అందంగా, వైవిధ్యంగా చూపిస్తారో -సీతారామం-తో నిరూపితమవ్వడంతో ఇమ్మాన్వీ పై కూడా అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆమె పాత డ్యాన్స్ వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. టాలీవుడ్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చేసిందంటూ ట్రేడ్ వర్గాలు కూడా భావించాయి. అయితే ఆరంభంలో కనిపించిన ఆ హడావుడి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. -ఫౌజీ- అనౌన్స్‌మెంట్ తర్వాత ఇమ్మాన్వీ నుంచి ఎలాంటి పెద్ద చప్పుడు లేదు. కొత్తగా ఆమె వేరే ఏ తెలుగు ప్రాజెక్ట్‌కూ సైన్ చేసినట్లు ప్రచారం జరగకపోవడం.. అలాగే టాలీవుడ్ ఈవెంట్లలో గానీ, సర్కిల్స్‌లో గానీ అమ్మడి పేరు ఎక్కడా పెద్దగా వినిపించ కపోవడంతో ఫౌజీ బ్యూటీ లైనప్ స్తబ్దుగా మారిందనే చర్చ మొదలైంది..సాధారణంగా ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ సరసన అవకాశం వస్తే ఇతర నిర్మాతలు, దర్శకులు ఆ కథానాయికతో సినిమాలు చేసేందుకు క్యూ కడుతుంటారు. ఆ క్రేజ్‌ను వాడుకుని వరుసగా ప్రాజెక్ట్‌లు దక్కించుకోవడం ఇండస్ట్రీలో సహజంగా జరిగే ప్రక్రియ. కానీ ఇమ్మాన్వీ మాత్రం అందుకు భిన్నంగా సైలెంట్‌గా మొదటి సినిమాపైనే పూర్తి దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది